# బలగం TV

BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ | బుధవారం జూన్ 11 2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## వైద్య కళాశాలల్లో 433 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

### భర్తీ ప్రక్రియను పూర్తి చేసిన మెడికల్ బోర్డు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 433 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ పక్రియ పూర్తయింది. తుది మెరిట్ లిస్ట్‌తో పాటు.. ఈ పోస్టులకు ఎంపికైన వారి జాబితాను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు బుధవారం విడుదల చేసింది. గత నెలలో ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున (1:3) అభ్యర్థులతో ప్రొవిజినల్ మెరిట్ జాబితా విడుదల చేసిన బోర్డు.. మే 22, 23 తేదీల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టి తాజాగా ఎంపికైన వారి జాబితాను ప్రకటించింది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని 34 డిపార్ట్‌మెంట్లలో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి గతేడాది మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులో పీడియాట్రిక్, ఆర్థోపెడిక్స్, గైనకాలజీ, అనస్థీషియా విభాగాలకు సంబంధించి 174 పోస్టుల భర్తీ పక్రియ గతంలోనే పూర్తి చేసిన అధికారులు.. మిగతా 30 విభాగాల్లో 433 పోస్టులకు ఎంపిక పక్రియను తాజాగా పూర్తి చేశారు. ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారందరికీ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అభినందనలు తెలిపారు. త్వరలోనే వారికి నియామక పత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు.



## పుష్కర కాలంలో
# అనేక మార్పులు తీసుకుని వచ్చాం

- మాటలతో కాకుండా చేతలతో అభివృద్ది చేసి చూపాం
- 12 ఏళ్లుగా కాంగ్రెస్ పాపాలను కడుక్కుంటూ వస్తున్నాం
- కాంగ్రెస్ పాలనలో వ్యవస్థల ధ్వంసం...వేలకోట్ల కుంభకోణాలు
- 2014కు ముందు..ఇప్పుడు దేశ పరిస్థితిని ప్రజలు గమనించాలి
- 'వికసిత్ భారత్ 2047' దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం
- 12 ఏళ్లు ప్రధానిగా పనిచేసే అవకాశం ఇచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు
- ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాల భేటీలో ప్రధాని మోడీ ప్రసంగం

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

కాంగ్రెస్ హయాంలో దేశంలో అనేక సమస్యలు ఉండేవని.. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక మార్పులు తెచ్చామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక దేశ ప్రజల్లో నమ్మకం పెరిగిందన్న ఆయన.. దేశాభివృద్ధికి స్థిరమైన ప్రభుత్వం ఉండాలని ప్రజలు కోరుకున్నారని చెప్పారు. ప్రధానిగా 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఢిల్లీలో జరిగిన ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సదస్సుకు ప్రధాని మోదీ హాజరై ప్రసంగించారు. ఎక్కువ కాలం ప్రధానిగా ఉండే అవకాశం ఇచ్చిన దేశప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్డీయేలో ఉన్న అన్ని పార్టీలకు ఈ విజయం దక్కుతుందన్న ఆయన.. దేశ రాజకీయాల్లో నేడు చారిత్రకమైన రోజుగా అభివర్ణించారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. రూ.వేల కోట్ల కుంభకోణాలు జరిగాయి. అభివృద్ధి రేటు దారుణంగా ఉండేది. మేం వచ్చాక రోడ్లు, రైల్వేలు, విమానాశ్రయాల అభివృద్ధిపై దృష్టి పెట్టాం. ఇంటర్నెట్ వాడేవాళ్ల సంఖ్య 25 కోట్ల నుంచి వంద కోట్లకు పెంచాం. భారత్ 2014కు ముందు.. ఇప్పుడెలా ఉందో గమనించాలి. ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన తర్వాత పెను మార్పులను ప్రజలు బేరీజు వేసుకోవాలి. కేవలం 12 ఏళ్లలోనే ఇన్ని మార్పులు తీసుకొచ్చాం. మా పథకాలు, కార్యక్రమాలను ప్రజలు కూడా ఆమోదించారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. గతంలో 370 ఆర్టికల్ అంటేనే భయపడేవారు.. మేం రద్దు చేశాం. గతంలో ఉగ్రవాదం పేరు చెబితే భయపడేవారు. మేం వచ్చాక దాడులు చేశాం. దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాం. 'వికసిత్ భారత్ 2047' దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం. దేశంలో వస్తోన్న పెనుమార్పులను ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోంది. పలు దేశాలు సమస్యల పరిష్కారం కోసం మన వైపు చూస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ తన వైఫల్యాలను హిందువులపై

మిగితా 2వ పేజీలో

# 'భారత్ ఫ్యూచర్ సిటీ' భవిష్యత్తుకు దిక్సూచి..

- తెలంగాణ చరిత్రలో జూన్ 10 సువర్ణాక్షరాల అధ్యాయం
- నెట్ జీరో, కాలుష్యరహిత నగరంగా ప్రపంచ పటంలో నిలుపుతాం
- సీఎం రేవంత్ రెడ్డి!
- ఎఫ్‌సీడీఏ భవనాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి!
- మరికొన్ని గ్రామాల విలీనానికి ముఖ్యమంత్రి సూత్రప్రాయ ఆమోదం
- 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగడమే లక్ష్యం




బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'భారత్ ఫ్యూచర్ సిటీ' నిర్మాణంలో ఒక కీలక మైలురాయి నమోదైంది. రికార్డు స్థాయిలో కేవలం 150 రోజుల్లోనే నిర్మాణం పూర్తి చేసుకున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ' (ఫీజణూ) నూతన భవనాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి బుధవారం (జూన్ 10న) ఘనంగా ప్రారంభించి, ప్రజలకు అంకితం చేశారు. అనంతరం ఫ్యూచర్ సిటీకి సంబంధించిన అధికారిక డిజిటల్ పోర్టల్‌ను కూడా ఆయన ఆవిష్కరించారు.

ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**మరికొన్ని గ్రామాల విలీనం:**

ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో తమ గ్రామాలను కలపాలని స్థానికుల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, పంచాయతీ తీర్మానాల మేరకు.. మరికొన్ని గ్రామాలను ఫ్యూచర్ సిటీ పరిధిలోకి చేరుస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూత్రప్రాయ ఆమోదం తెలిపారు. తీర్మానాలు చేసిన మిగతా గ్రామాలను కలిపే అంశంపై ఫ్యూచర్ సిటీ కార్యాలయంలోనే గ్రామాల వారీగా స్వయంగా చర్చించి, స్థానిక సమస్యలను పరిష్కరిస్తూ తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఇందుకోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు వారానికోసారి ఇక్కడికి వస్తారని, తాను కూడా వీలైనప్పుడల్లా కార్యాలయాన్ని సందర్శిస్తానని సీఎం పేర్కొన్నారు.

**ప్రపంచ నగరాలతో పోటీ.. నెట్ జీరో సిటీగా గుర్తింపు:**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "భారత్ ఫ్యూచర్ సిటీ దేశానికే కాదు, ప్రపంచానికే ఒక గొప్ప నగరంగా, భవిష్యత్ తరాలకు దిక్సూచిగా రాణిస్తుంది. ఒకప్పుడు హైదరాబాద్ లేక్స్ అండ్ రాక్స్ సిటీగా, ముత్యాల నగరంగా ఎలా పేరుగాంచిందో.. ఫ్యూచర్ సిటీ కూడా 'నెట్ జీరో సిటీ'గా, కాలుష్యరహిత నగరంగా ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తుంది" అని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే 8 ఏళ్లలో, అంటే 2034 నాటికి టోక్యో, న్యూయార్క్, సింగపూర్ నగరాలతో పోటీ పడేలా ఈ నగరాన్ని సంపూర్ణంగా నిర్మించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. 2034 నాటికి తెలంగాణ 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగడానికి ఈ నగరమే ప్రధాన వేదిక కానుందని స్పష్టం చేశారు.

**గ్లోబల్ ఫార్చ్యూన్ 500 కంపెనీలే లక్ష్యం:**

2026 జూన్ 10వ తేదీ తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందని సీఎం అన్నారు. ఫ్యూచర్ సిటీలో గ్రీన్ ఫార్మా, స్పోర్ట్స్, ఎడ్యుకేషన్, హెల్త్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఆక్మీ), డేటా సెంటర్స్, జీసీసీ సెంటర్లతో పాటు గ్లోబల్ ఫార్చ్యూన్ 500 కంపెనీలను ఇక్కడికి రప్పించేందుకు నేడు బలమైన పునాది పడిందన్నారు. వచ్చే డిసెంబర్‌లో ఇక్కడే మరోసారి 'గ్లోబల్ సమ్మిట్' నిర్వహించి, ప్రపంచ దేశాల నుంచి భారీగా పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా లక్షలాది మంది తెలంగాణ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ప్రకటించారు. గత డిసెంబర్‌లో పనులు ప్రారంభించి 150 రోజుల్లోనే కార్యాలయం తెరవడం తమ ప్రభుత్వ వేగవంతమైన పనితనానికి, అధికారుల ప్రణాళికకు నిదర్శనమన్నారు.

**అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం**

ఇటీవల కురిసిన వర్షాలకు హైదరాబాద్‌లో రోడ్లు జలమయం కావడం, ట్రాఫిక్ స్తంభించడంపై సీఎం స్పందిస్తూ.. చెరువులు, కుంటలు, నాలాలు ఆక్రమణలకు గురికావడమే దీనికి ప్రధాన కారణమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితులు రాకుండా ఉండేందుకు హైదరాబాద్ వ్యాప్తంగా అక్రమ కట్టడాలను నిర్దాక్షిణ్యంగా తొలగిస్తూ, నాలాలను పునరుద్ధరిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## దర్శక దిగ్గజం భారతీరాజ కన్నుమూత

### తమిళ చిత్రపరిశ్రమ దిగ్భ్రాంతి



బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

తమిళ చలనచిత్ర చరిత్రలో గ్రామీణ కథలకు సరికొత్త దిశను చూపి, వెండితెరపై పల్లెటూరి అందాలను అత్యంత అద్భుతంగా ఆవిష్కరించిన సినీ దిగ్గజం, 'దర్శక ఇమయం' భారతీరాజా కన్నుమూశారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం తుదిశ్వాస విడిచారు. నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన తన సినీ ప్రస్థానంలో భారతీయ సినిమా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే అద్భుత చిత్రాలను అందించి, ప్రేక్షకులను అలరించిన ఆయన మృతి సినీ రంగానికి తీరని లోటును మిగిల్చింది. 1941 జూలై 17న తమిళనాడులోని తేని జిల్లా అల్లినగరంలో జన్మించిన భారతీరాజా, 1977లో విడుదలైన 16 వయతినిలే' చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేసి అప్పట్లోనే పెద్ద సంచలనం సృష్టించారు. అప్పటివరకు స్టూడియోలకే పరిమితమైన సినిమాలను అవుట్‌డోర్‌కు తీసుకొచ్చి, తమిళ సినిమాల్లో గ్రామీణ జీవన విధానాన్ని , అక్కడి సహజత్వాన్ని కళ్లకు కట్టినట్లు చూపించి ప్రత్యేక గుర్తింపు పొందారు. అందుకే ఆయనను అభిమానులు, పరిశ్రమ వర్గాలు ఎంతో గౌరవంగా 'దర్శక ఇమయం' అని పిలుచుకుంటారు. ఆయన కెరీర్‌లో సిగప్పు రోజక్కల్, కిజక్కే పోగుం రైల్, అలైగల్ ఓయ్వతిక్కి-లలై, ముదల్ మరియాదై, కరుత్తమ్మ వంటి ఎన్నో క్లాసిక్ చిత్రాలను తెరకెక్కించారు. ఆయన మృతికి సినీ, రాజకీయ పరిశ్రమకు చెందిన పలువురు సంతాపం తెలిపారు. సిఎం విజయ్ నివాళి అర్పించారు.

## తొలి వర్షానికే చేతులెత్తేసిన కాంగ్రెస్ సర్కార్

### హైదరాబాద్ ప్రజల నరకయాతనకు సీఎం రేవంత్ రెడ్డి అసమర్థతే కారణం

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ధ్వజం



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తొలి వర్షానికే రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరం అతలాకుతలమైందని ఇంత నిర్లజ్జగా అంగీకరించడానికి రేవంత్ రెడ్డికి సిగ్గనిపించడం లేదా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ రాష్ట్రానికి దురదృష్టవశాత్తు ఆయనే వ

మిగితా 2వ పేజీలో

## భార్యను తుపాకీతో కాల్చిచంపిన భర్త

### మల్కాజిగిరిలో సంచలనం

### అనుమానంతో మూడు రౌండ్ల కాల్పులు..

### నిషారాణి అక్కడికక్కడే మృతి



బలగం టీవి, హైదరాబాద్

మల్కాజిగిరిలో భార్యపై అనుమానం పెంచుకున్న భర్త తుపాకీతో కాల్చిచంపిన ఘటన తీవ్ర కలకలం రేపింది. కట్టుకున్న భార్యపై అత్యంత సమీపం నుంచి మూడు రౌండ్ల కాల్పులు జరపడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన స్థానికంగా సంచలనంగా మారింది.

పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. మల్కాజిగిరి మారుతీనగర్‌కు చెందిన అరుణ్ కుమార్ రియల్ ఎస్టేట్, ఫైనాన్స్ వ్యాపారాలు నిర్వహిస్తున్నాడు. గతంలో స్వర్ణలత అనే మహిళను వివాహం చేసుకున్న అతడికి ఇద్దరు సంతానం. అనంతరం మొదటి భార్యతో విడిపోయిన అరుణ్ కుమార్, ఏడేళ్ల క్రితం ఆమె సోదరి నిషారాణిని రెండో వివాహం చేసుకున్నాడు. కొంతకాలం వీరి దాంపత్య జీవితం సజావుగానే సాగినా, ఇటీవల నిషారాణి ప్రవర్తనపై అరుణ్ కుమార్ అనుమానం పెంచుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తరచూ ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. బుధవారం తెల్లవారుజామున మరోసారి భార్యాభర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆగ్రహానికి గురైన అరుణ్ కుమార్ తన వద్ద ఉన్న రివాల్వర్‌తో నిషారాణిపై వరుసగా మూడు రౌండ్ల కాల్పులు జరిపాడు. తూటాలు తగలడంతో ఆమె తీవ్ర రక్తస్రావానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది.

అరుణ్ కుమార్‌కు గతంలోనూ నేరచరిత్ర ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఆరు నెలల క్రితం అంబర్‌పేట్ పరిధిలో అక్రమంగా రివాల్వర్ కలిగి ఉన్న కేసులో అతడు అరెస్టై జైలు శిక్ష అనుభవించినట్లు సమాచారం. ఇటీవలే బెయిల్‌పై విడుదలైన అతడు, అదే ఆయుధంతో భార్యను హత్య చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది.ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. హత్యకు దారితీసిన పరిస్థితులు, ఆయుధం వినియోగంపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



## జూన్ 2027 నాటికి మేడిగడ్డ బ్యారేజ్ సిద్ధం

### మరమ్మతుల పనులు ఈ ఏడాది చివర్లో ప్రారంభం

### డిజైన్లు సెప్టెంబర్ నాటికి సిద్ధం : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగమైన మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల మరమ్మతులు, పునరుద్ధరణ పనులను వేగవంతంగా చేపడుతున్నామని, మేడిగడ్డ బ్యారేజ్‌ను 2027 జూన్ నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.బుధవారం మేడిగడ్డ బ్యారేజ్‌ను సందర్శించిన మంత్రి, అక్కడ కొనసాగుతున్న సాంకేతిక పరిశోధనలు, పరీక్షల పురోగతిని సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించిన డిజైన్లు 2026 సెప్టెంబర్ నాటికి సిద్ధమవుతాయని, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) అనుమతుల అనంతరం ఈ ఏడాది అక్టోబర్ లేదా నవంబర్‌లో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.

ప్రస్తుతం హైడ్రాలజికల్ అధ్యయనాలు, గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్ (జీపీఆర్) పరీక్షలు, జియోటెక్నికల్ బోర్‌హోల్ సర్వేలు తదితర సాంకేతిక పరిశోధనలు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రాథమిక పరిశోధనల్లో ఎక్కువ భాగం పూర్తయిందని, మిగిలిన అధ్యయనాలు జూన్ చివరి నాటికి లేదా జూలై మొదటి వారంలో ముగిసే అవకాశముందని పేర్కొన్నారు. పరీక్షల ఫలితాల ఆధారంగా పునరుద్ధరణకు సంబంధించిన సమగ్ర డిజైన్లను రూపొందించి కేంద్ర జల సంఘం, జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీకి సమర్పిస్తామని తెలిపారు. వర్షాకాలం ముగిసిన తర్వాత, నవంబర్ చివరి లేదా డిసెంబర్ తొలి వారంలో మరమ్మతుల పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. ఒకే పనిదశలో పునరుద్ధరణ పనులను పూర్తి చేసి 2027 వేసవి నాటికి మూడు బ్యారేజీలను తిరిగి అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి వెల్లడించారు.

మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలకు 2023 అక్టోబర్‌లో నష్టం సంభవించిందని గుర్తుచేసిన మంత్రి, కేంద్ర సంస్థల పరిశీలనలో డిజైన్, నిర్మాణం, నిర్వహణలో పలు లోపాలు వెలుగుచూశాయని తెలిపారు. ప్రస్తుతం మూడు బ్యారేజీలలో 80 నుంచి 90 శాతం వరకు జీపీఆర్ పరీక్షలు పూర్తయ్యాయని, బోర్‌హోల్, జియోటెక్నికల్ పరిశోధనలు 75 నుంచి 80 శాతం వరకు పూర్తయ్యాయని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో 40 నుంచి 80 మీటర్ల లోతు వరకు బోర్‌హోల్స్ తవ్వి భూగర్భ పరిస్థితులపై సమాచారం సేకరిస్తున్నట్లు వివరించారు. భవిష్యత్తులో చేపట్టే అన్ని డిజైన్లు, మరమ్మతులు, అదనపు పనులు కేంద్ర జల సంఘం, జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ ఆమోదంతోనే చేపడతామని మంత్రి స్పష్టం చేశారు. దీని ద్వారా బ్యారేజీలు రాబోయే దశాబ్దాల పాటు సురక్షితంగా, సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రాజెక్టు అంశాన్ని రాజకీయ కోణంలో చూడాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని, జవాబుదారీతనం, భద్రత, పనుల పూర్తి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు నేడు విడుదల

### ఉదయం 11.30 గంటలకు ఫలితాల వెల్లడి

### అధికారిక వెబ్‌సైట్లలో అందుబాటులోకి రానున్న ఫలితాలు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఇంటర్‌మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను గురువారం ఉదయం 11.30 గంటలకు విడుదల చేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఇంటర్‌మీడియట్ విద్యా మండలి (టీజీబీఐఈ) ప్రకటించింది.ప్రథమ, ద్వితీయ సంవత్సరాల అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరైన విద్యార్థులు ఉదయం 11.30 గంటల నుంచి తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్లలో పరిశీలించవచ్చని బోర్డు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.విద్యార్థులు తమ హాల్‌టికెట్ నంబర్ నమోదు చేసి ఫలితాలను పొందవచ్చని పేర్కొంది. ఫలితాల కోసం బోర్డు అధికారిక వెబ్‌సైట్ tgbie.cgg.gov.inతో పాటు results.cgg.gov.in వెబ్‌సైట్లను సందర్శించాలని సూచించింది.సప్లిమెంటరీ పరీక్షలకు హాజరైన వేలాది మంది విద్యార్థులు ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, బోర్డు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపింది.

## 127 మంది సైబర్ నేరస్తుల అరెస్ట్

### సైబర్ సెక్యూరిటీ బ్యూరో వెల్లడి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

127 మంది సైబర్ నేరస్తులను అరెస్ట్ చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో బుధవారం వెల్లడించింది. సైబర్ మోసాలపై ఆపరేషన్ క్రాక్ డౌన్ 3.0లో భాగంగా ఈ నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపింది. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో రాష్ట్రవ్యాప్తంగా 127 మంది సైబర్ నేరస్తులను గుర్తించామని వివరించింది. వారిలో 57 మంది తెలంగాణకు చెందిన వారని.. మిగిలిన వారు ఇతర రాష్ట్రాలకు చెందిన వారని పేర్కొంది. సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లు, జిల్లా సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ కేంద్రాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించాయని వివరించింది. 48 మంది నకిలీ గుర్తింపుతో ఈ మోసాలకు పాల్పడ్డారని తెలిపింది. 27 మంది ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్, 11 మంది డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లలో ఉన్నట్లుగా గుర్తించామని చెప్పింది. ఈ నిందితుల్లో 68 శాతం మంది పాత సైబర్ నేరస్తులేనని టీజీసీఎస్‌బీ స్పష్టం చేసింది. ప్రజలను మోసం చేసినట్లు 103 మంది నిందితులు తమ విచారణలో వెల్లడించారని తెలిపింది. ఈ నిందితుల వద్ద నుంచి కీలక డిజిటల్ ఆధారాలతోపాటు పలు పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు టీజీసీఎస్‌బీ పేర్కొంది. అయితే 24 మంది నిందితులు పరారీలో ఉన్నారని వెల్లడించింది. వారి కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేసినట్లు చెప్పింది. సైబర్ నేరాల కట్టడికి మరిన్ని కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో స్పష్టం చేసింది.

## 25 నుంచి సర్ పక్రియ ప్రారంభం

### ఐటిని వినియోగించుకోవాలన్న కమిషనర్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఈనెల 25 నుండి ప్రారంభం కానున్న ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఐటి విరివిగా వాడుకోని ఓటరు నమోదు పక్రియలో పూర్తి పారదర్శకంగా ఎలాంటి తప్పులకు తావివకుండా ఎస్ఐఆర్ పక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. క్ష్మిఎధవారం ఎస్ఐఆర్ పక్రియలో భాగంగా ఐటి వినియోగంపై జిల్లా, మండల స్థాయి మాస్టర్ ట్రైనర్స్, ఐటి సపోర్ట్ టీం, డేటా ఆపరేటర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ పక్రియలో ఐటి అంశం అత్యంత కీలకమైనదని, దానిని సిబ్బంది విరివిగా వాడుకొని ఎస్ఐఆర్ పక్రియను వేగవంతం, సమర్థవంతంగా చేపట్టేందుకు దోహదపడుతుందని, అంతేకాకుండా ఓటరు జాబితా రూపొందించడంలో పారదర్శకత ఉంటుందని తెలిపారు. అలాగే ఓటర్లు ఆన్ లైన్ ద్వారా తమ పేరును ఎన్యుమరేషన్ చేసుకోవడానికి లనీబిIస.Iఇతి.ఐనీల.తిని వెబ్ సైట్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భారత ఎన్నికల కమిషన్ ఐటికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చే విధంగా తెచ్చిందని, దీంతో ఎస్ఐఆర్ పక్రియ మరింత సులభతరం చేసేందుకు ఇందులో వివిధ టూల్స్ను పొందుపరిచిందని, వీటిని ఉపయోగించడంపై మాస్టర్ ట్రైనర్లు, ఐటి సపోర్ట్ టీమ్ లు క్షేత్రస్థాయిలో డేటా ఆపరేటర్లకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఆన్ లైన్ ద్వారా ఓటర్లను ఎన్యుమరేషన్ చేసుకునేందుకు సదుపాయం కల్పించినందున దీనిపై అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను సిఇఒ ఆదేశించారు. అనంతరం రాష్ట్ర శిక్షణ నోడల్ అధికారి బి. చెన్నయ్య, ఎస్ఐఆర్ పక్రియలోని వివిధ దశలను సవివరంగా వివరించారు.

## ఘనా పారిశ్రామికాభివృద్ధికి 'తెలంగాణ' మార్గనిర్దేశం

### 'ఫార్మా హబ్' ఏర్పాటుకు పూర్తిస్థాయి సహకారం

### ఘనా ఉన్నత స్థాయి బృందంతో మంత్రి శ్రీధర్ బాబు



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రిపబ్లిక్ ఆఫ్ ఘనా పారిశ్రామికాభివృద్ధికి మార్గనిర్దేశం చేసేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. అక్కడ ఏర్పాటు చేయనున్న 'ఫార్మా హబ్'కు రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆ దేశ ప్రెసిడెన్షియల్ అడ్వైజర్ ఆగస్టస్ ఒబువాడుం టానో నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం సచివాలయంలో బుధవారం మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా 'తెలంగాణ-ఘనా' మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ఘనా అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 24 అవర్ ఎకానమీ అండ్ యాక్సలరేటెడ్ ఎక్స్ పోర్ట్ డెవలప్ మెంట్ ప్రోగ్రాం, ఫార్మా హబ్ ఏర్పాటు తదితర అంశాలను ఆగస్టస్ ఒబువాడుం టానో వివరించారు. ఘనా పారిశ్రామిక, ఆర్థిక పరివర్తనకు సహకరించాలని మంత్రి శ్రీధర్ బాబును విజ్ఞప్తి చేశారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఆనతికాలంలోనే పారిశ్రామికరంగంలో తెలంగాణ అద్భుతమైన వృద్ధిని నమోదు చేసిందన్నారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, ఫుడ్ ప్రాసెసింగ్, డిఫెన్స్, అడ్వాన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ తదితర రంగాల్లో అంతర్జాతీయ కేంద్రంగా ఎదిగిందన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించేందుకు అమలు చేస్తున్న 'ఈజ్ ఆఫ్ డూయింగ్ పాలసీ'లను ఆయన వివరించారు. ఫార్మాస్యూటికల్ మ్యానుఫ్యాక్చరింగ్, రీసెర్చ్, వ్యాక్సీన్ల తయారీ, గ్లోబల్ సప్లై చైన్ నిర్వహణ, లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణకున్న అంతర్జాతీయ నైపుణ్యాన్ని పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఘనా ప్రతినిధులకు చెప్పారు. ఘనా పారిశ్రామిక, ఆర్థిక పరివర్తనలో తెలంగాణ ఒక నమ్మకైన భాగస్వామిగా ఉంటుందని భరోసానిచ్చారు.

## 370 రద్దుతో ..నెహ్రూ రికార్డును అధిగమించిన మోడీ !

భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే మున్నెన్నడూ చూడని ఒక అరుదైన మైలురాయి ఆవిష్కృతం అయ్యింది. దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ పేరిట ఏడు దశాబ్దాలుగా చెక్కుచెదరకుండా ఉన్న అత్యధిక కాలం ఎన్నికైన ప్రధాని రికార్డును ఈ నెల 10న ప్రధాని నరేంద్ర మోడీ బద్దలు కొట్టారు. ఇక ప్రధానిగా మోడీ సాధించిన విజయాలు అనేకం ఉన్నాయి. ఇవన్నీ కూడా భారతదేశ చరిత్ర గతిని తిప్పేవని చెప్పుకోక తప్పదు. ప్రధానంగా నెహ్రూ 370 ఆర్టికల్ పెట్టి కశ్మీర్‌ను ఇండియాకు దూరం చేస్తే..అదే 370ని రద్దు చేయడం ద్వారా ప్రధాని మోడీ చారిత్రక నిర్ణయం తీసుకుని, కాశ్మీర్‌ను భారత్‌లో సంపూర్ణంగా విలీనం చేశారు. అలాగే కాశ్మీర్ ఇప్పుడు సంపూర్ణంగా విలీనం కావడంతో పాటు, అక్కడ వేర్పాటువాద, ఉగ్రవాద మూకలను క్రూకటి వేళ్లతో పెరివేశారు. మోడీ ధృఢ సంకాల్పినికి...చరిత్రాత్మక నిర్ణయానికి ఇది నిదర్శనంగా చూడాలి. పటేల్ తరహాలో దేశంలో ఐక్యత సాధించే యత్నాలను నేటికీ మోడీ కొనసాగించే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. 2014 మే 26న ప్రమాణ స్వీకారం చేసిన మోడీ.. వరుసగా మూడు సార్లు అధికారంలోకి వచ్చి, సందిగ్ధ రాజకీయ పరిస్థితులను దాటుకుంటూ సగర్వంగా 4,399 రోజులు పూర్తి చేసుకోవడం చిన్న విషయం కాదు. తద్వారా దేశ రాజకీయాల్లో ఒకే ఒక్కడుగా కొత్త చరిత్ర సృష్టించారు. ఈ క్రమంలో భారత రాజకీయాల్లో జూన్ 10, 2026 ఒక సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజుగా నిలిచిపోనుంది. ఆ రోజుతో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ చరిత్రలోనే అత్యధిక కాలం సేవలు అందించిన నేరుగా ప్రజలు ఎన్నుకున్న ప్రధానిగా సరికొత్త రికార్డు సృష్టించారు. స్వతంత్ర భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న 12 ఏళ్ల 14 రోజుల రికార్డును ప్రధాని మోడీ అధిగమించారు. అంతేగాకుండా అందరికీ దూరంగా,అంటరాని పార్టీగా ఉన్న బిజెపిని ప్రజల్లోకి తీసుకెళ్లిన ఘనత కూడా మోడీదని చెప్పాలి. అందుకు ఆయనకు కుడిభుజంగా పనిచేస్తున్న అమిత్ షా వ్యూహాలను కూడా తక్కువ చేయలేం. ఈ ఇద్దరి జంట దేశంలో భారతీయ జనతాపార్టీ పునాదులను బలోపేతం చేసిందనడంలో సందేహం లేదు. ఇక మోడీ తీసుకున్న నిర్ణయాల్లో మరోటి అయోధ్య సమస్యకు చెక్ పెట్టడం. రావణ కాష్టంలా ఉన్న అయోధ్య సమస్యను సుప్రీం కోర్టు ముందుంచి పరిష్కరించగలగడం చారిత్రాత్మక విజయంగా చూడాలి. కోటానుకోట్ల హిందువుల గుండెల్లో ఇది చిరస్మరణీయ నిర్ణయంగా నిలిచిపోయింది. ట్రిపుల్ తల్లాక్ వంటి అనాగరిక చట్టాలను కూడా రద్దు చేయడం ద్వారా ముస్లిం మహిళలకు అండగా నిలబడ్డారు. ప్రధానంగా ఉమ్మడి పౌరస్మృతి కోసం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తే.. భారత్‌లో విభజన రాజకీయాలకు చెక్ పడనుంది. అలాగే మహిళా బిల్లును గట్టెక్కించే ప్రయత్నంలో ఓ అడుగు పడింది. అంతేకాకుండా అంతర్జాతీయంగా యోగా దినోత్సవాన్ని జూన్ 21న నిర్వహించేలా ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానం మోడీ ప్రతిభకు నిదర్శనంగా చూడాలి. అలాగే అనేక దేశాల్లో పర్యటించి భారత్ ప్రతిభను చాటడమే గాకుండా ఆయా దేశాలతో సంబంధ బాధంవ్యాలను బలోపేతం చేయడంలో అద్భుత విజయం సాధించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకున్న ప్రధానిగా జవహార్‌లాల్ నెహ్రూ దేశంపై తనదైన ముద్ర వేశారు. ఆయన కూడా అనేక సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారు. తొలి ప్రధానిగా నెహ్రూపై దేశ పునర్నిర్మాణ బాధ్యత లు పడ్డాయి. అదే స్వతంత్ర భారతాన్ని పటిష్ఠమైన పునాదులతో పదిలంగా నిర్మించడం.. అంతేకాదు పేదరికంలో మగ్గిపోతున్న, శతాబ్దాల బానిసత్వంతో ఆత్మవిశ్వాసం కోల్పోయిన జాతిని సగర్వంగా తలెత్తుకు నిలిపేలా చేయడం. ఇవి మరే ప్రధానికీ ఎప్పుడూ ఎదురుకాని కఠిన సవాళ్లు అనడంలో సందేహం లేదు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్ని సమర్థంగా నిభాయించిన నెహ్రూ.. దేశంపై చెరిగిపోలేని ముద్ర వేశారు. అందుకు ఆనాటి ఉప ప్రధాని పటేల్ చేదోడువాదోడుగా నిలిచారు. సంస్థానాలను విలీనం చేసి దేశాన్ని ఐక్యంగా నిలబెట్టారు. అంతకుముందు స్వాతంత్రోద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన నెహ్రూ.. ఆ తర్వాత స్వతంత్ర భారత తొలి ప్రధానిగా.. అటు స్వయంత్ర సమరయోధుల ఆశయ సాధనకు, ఇటు దేశ ప్రజల ఆకాంక్షలకు పెద్దపీట వేస్తూ.. పాలన సాగించారనడంలో సందేహం లేదు. అయితే పదవీకాలం ప్రకారం ఇన్నాళ్లుగా చెక్కుచెదరని చారిత్రక రికార్డు నెహ్రూ పేరిట ఉండగా ప్రధాని మోడీ ఇప్పుడు దానిని అధిగమించారు. ప్రజాస్వామ్య ఎన్నికల్లో నెహ్రూ కాంగ్రెస్ పార్టీ తరపున ప్రజాప్రతినిధిగా ఎన్నికై దేశానికి ప్రధాన మంత్రిగా ప్రాతినిథ్యం వహించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నుంచి ఇప్పటిదాకా 15 మంది ప్రధాన మంత్రులుగా ప్రాతినిథ్యం వహించారు. జాతీయ ప్రజాస్వామ్య కూటమిలో బీజేపీ తరఫున నరేంద్రమోడీ సుదీర్ఘకాలం పనిచేసిన ప్రధానమంత్రిగా అరుదైన రికార్డును కొన్నేళ్ల క్రితమే సొంతం చేసుకున్నారు. ఇప్పుడు నెహ్రూ రికార్డును అధిగమించారు. అలాగే కోట్లాది మంది భారతీయులకు ఆరాధ్యనేతగా ఎదిగారు. ఇది ఆషామాషీ విషయం కాదు. ప్రజల గుండెల్లో స్థానం సంపాదించడం మామూలు విషయం కాదు. ఇది దేశ చరిత్రలోనే ఓ అరుదైన మైలురాయిగా నిలిచిపోనుంది. 2014లో ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసిన నరేంద్రమోడీ తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు ఆయనను ప్రజలకు చేరువ చేస్తున్నాయి. 370 రద్దు, ట్రిపుల తలాక్ రద్దు, అయోధ్య, మహిళా బిల్లు వంటివన్నీ మోడీకి జననీరాజనం పట్టేలా చేసినవే. దేశంలో రాష్ట్రప్రభుత్వ అధినేతగా.. దేశాధినేతగా నరేంద్రమోడీది ఎవరికీ సాధ్యంకాని రికార్డు నెలకొల్పారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోడీ దేశానికి రోల్ మోడల్ అయ్యారు. అలాగే ముఖ్యమంత్రి మంత్రి పదవికి రాజీనామా చేసి దేశానికి ప్రధాన మంత్రి అయ్యారు. సమర్థ నాయకత్వం..సుస్థిర పాలనతో భారత రాజకీయాల్లో ఒక చారిత్రాత్మక మైలురాయిని సాధించారు. 25 ఏళ్ల రాజకీయ అనుభవంతో ప్రభుత్వ పాలనలో వివిధ రికార్డుల్ని బ్రేక్ చేశారు. సరికొత్త రికార్డులను నెలకొల్పి సంచలన నిర్ణయాలకు కారకులయ్యారు. సాంకేతికం గా చూస్తే నెహ్రూ మొత్తం ప్రధానిగా ఉన్న కాలం మోడీ కంటే కచ్చితంగా ఎక్కువే. కానీ నెహ్రూ మొదటి సారి 1947లో మధ్యంతర ప్రభుత్వానికి ప్రధానిగా ఉన్నారు తప్ప నేరుగా ప్రజల ద్వారా ఎన్నిక కాలేదు. కానీ, 2014 మే 26న మొదటిసారి నేరుగా ప్రజా బ్యాలెట్ ద్వారా ఎన్నికై ప్రధాని పీఠం అధిరోహించిన నరేంద్ర మోడీ, నాటి నుంచి నేటి వరకు నిరంతరాయంగా ప్రజామోదంతోనే ఈ రికార్డు సొంతం అయ్యింది.

## ప్రతిపక్ష బాధ లేని నెహ్రూ

బలగం టీవీ, న్యూఢిల్లీ

న్యూఢిల్లీ,జూన్10(ఆర్ఎన్ఎ): స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో నెహ్రూ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి దేశ జనాభా దాదాపు 34 కోట్లు. కానీ, మోడీ 2014లో పదవి చేపట్టే సమయానికి దేశ జనాభా 131 కోట్లు. ప్రస్తుతం 146 కోట్లు అని అంచనా. ఇన్నేళ్లలో దేశంలో ప్రజాస్వామ్యం, రాజకీయ పార్టీల భాగస్వామ్యం కూడా పెరిగింది. దేశంలో తొలి ఎన్నికలు జరిగిన 1951–52లో 53 రాజకీయ పార్టీలు పోటీ చేశాయి. 2014 లోక్‌సభ ఎన్నికల సమయానికి దేశంలో 464 పార్టీలు పోటీచేయగా, 2024 ఎన్నికల సమయానికి 744 పార్టీలు పోటీ చేశాయి. దేశ తొలి ఎన్నికల సమయంలో 17 కోట్ల మంది ఓటు వేయగా, 2014 నాటికి దాదాపు 84 కోట్ల మంది ఓటు వేశారు. నెహ్రూ హయాంలో కాంగ్రెస్ ఆధిపత్యమే ఎక్కువగా ఉండేది. అప్పట్లో 489 లోక్‌సభ స్థానాలుంటే అందులో 364 సీట్లు కాంగ్రెస్ దక్కించుకుంది. కాంగ్రెస్ పార్టీకి నాయకత్వం వహించిన నెహ్రూకు ఆ కాలంలో పెద్దగా జాతీయ స్థాయి ప్రతిపక్షం ఎదురుకాలేదు. ఆయన సెక్యులర్ ఐక్యత సిద్దాంతంతో దేశాన్ని నడిపించారు.

## మెట్రో స్టేషన్ల కింద లీజుకు ఎలా ఇస్తారు

**పాదచారులకు ఇబ్బంది కలిగించడంపై హైకోర్టు ఆగ్రహం**

బలగం టీవీ, హైదరాబాద్

మెట్రోస్టేషన్ల కింద పాదచారుల కోసం కేటాయించిన ఫుట్‌పాత్ ప్రాంతాల్లో స్టాళ్ల ఏర్పాటుపై తెలంగాణ హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. పాదచారులు నడిచే ప్రాంతాలను లీజుకు ఇవ్వడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ విచారణ సందర్భంగా న్యాయవాది విజయ్ గోపాల్ కోర్టుకు వివరాలు సమర్పించారు. మెట్రోస్టేషన్ల కింద ఏర్పాటు చేసిన స్టాళ్ల విషయంలో ఇప్పటికే జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. అలాగే వీధి వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటున్న జీహెచ్ఎంసీ, మెట్రోస్టేషన్ల కింద ఉన్న వాణిజ్య స్టాళ్ల విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. దీంతో హైకోర్టు ఫుట్‌పాత్ స్థలాన్ని లీజుకు లేదా అద్దెకు ఎలా ఇస్తారని ప్రశ్నించింది. పాదచారుల కోసం ఉద్దేశించిన ప్రాంతాల్లో వాణిజ్య కార్యకలాపాలకు అనుమతి ఇవ్వడం ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగిస్తుందని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ అంశంపై సంబంధిత అధికారులు తీసుకున్న చర్యల వివరాలను సమర్పించాలని ఆదేశించింది. ఈ ఫిర్యాదుపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టారో పూర్తి నివేదికను సమర్పించాలని జీహెచ్ఎంసీ, హెచ్ఆర్ఎంఎల్‌లకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో తదుపరి విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేసింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో మెట్రోస్టేషన్ల కింద ఏర్పాటు చేసిన స్టాళ్ల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

## కోలివింగ్ హాస్టళ్లపై విచారణ చేయాలి

**ప్రభుత్వానికి విహెచ్ డిమాండ్**

బలగం టీవి, హైదరాబాద్

ప్రస్తుత సమాజంలో యువతీ యువకులు కలిసి ఉండే 'కో లివింగ్ హాస్టల్స్' సంస్కృతిపై సర్వత్రా చర్చ నడుస్తున్న వేళ.. ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ హాస్టల్స్ నిర్వహణ తీరు, అక్కడ అసలు ఏం జరుగుతోంది, యువత ఏ విధంగా ప్రభావితమవుతోంది అనే అంశాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం నడుస్తున్న కో–లివింగ్ హాస్టల్స్‌లో అసలు ఏం జరుగుతుందో క్షుణ్ణంగా పరిశీలించాలి. అక్కడ చోటుచేసుకుంటున్న పరిస్థితులపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలి. అలా చేసిన తర్వాతే వాటిని పూర్తిగా రద్దు చేయాలా? లేక కఠినమైన నిబంధనలను అమలు చేయాలా? అన్న విషయంపై స్పష్టత వస్తుంది. ఇలాంటి హాస్టల్స్ పరిధిలో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు మాత్రమే సమాజంలో, మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. కో–లివింగ్ హాస్టల్స్‌లో అమ్మాయిల తప్పా? లేక అబ్బాయిల తప్పా? తెలుసుకోవాలి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించాలంటే కమిటీ ద్వారా సమగ్ర విచారణ జరిపించి, నివేదిక ఆధారంగా ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాలి' అని అన్నారు.



## అనంతారం గ్రామ యాదవ్ సంఘం అధ్యక్షుడి గా మల్యాల మల్లేశం

బలగం, టీవీ ఇల్లంతకుంట

ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామ యాదవ్ సంఘం అధ్యక్షుడి గా మల్యాల మల్లేశం ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన కుల బందవులకు పేరు పేరున ప్రత్యేక ధన్యవాదలు తెలియజేసారు.అధ్యక్షుడి తో పాటు ఉపాధ్యక్షులుగా దారవేణి రాములు, కోశాధికారిగా అక్కేమ్ పర్శరాము, కార్యదర్శి గా జక్కుల మహేందర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ యాదవ కులస్తులు పాల్గొన్నారు

# పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీక

**గిరిజన హక్కుల పరిరక్షణకు చట్టం కీలకం**

**పీసా చట్టంపై వర్క్‌షాపు ప్రారంభించిన మంత్రి సీతక్క**

బలగం టీవి, హైదరాబాద్



పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీక అని మంత్రి సీతక్క అన్నారు. గ్రామసభలను బలోపేతం చేసి గిరిజన హక్కులను కాపాడాలన్నారు. గిరిజనుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణకు పీసా చట్టం కీలకమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. బుధవారం రాజేంద్రనగర్‌లో పీసా చట్టం అమలుపై రెండు రోజుల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను మంత్రి ప్రారంభించి... ప్రసంగించారు. పీసా చట్టంపై అధికారులు, ప్రజాప్రతినిధులకు పూర్తి అవగాహన అవసరమని తెలిపారు. పీసా కేవలం చట్టం కాదని.. ఆదివాసీల స్వయం నిర్ణయాధికారానికి రక్షణ కవచమని వెల్లడించారు. గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని.. గ్రామసభలే ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలని మంత్రి తెలిపారు. సహజ వనరులపై గ్రామసభల నిర్ణయాధికారాన్ని పీసా చట్టం కల్పించిందన్నారు. చట్టం ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను పక్కనబెట్టి కార్పొరేట్ల చేతుల్లోకి సహజ వనరులు వెళ్లకూడదన్నారు. పీసా చట్ట స్ఫూర్తిని అర్థం చేసుకుని అమలు చేసినప్పుడే ఆదివాసీలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. సర్పంచులు గ్రామాభివృద్ధి నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి గ్రామసభల బలోపేతంతోనే సాధ్యమని స్పష్టం చేశారు. గిరిజన హక్కుల పరిరక్షణ తనకు ప్రత్యేక బాధ్యతగా చెప్పుకొచ్చారు. ఉన్నవారి కోసం కాదు.. లేని వారి కోసం పనిచేయడమే ప్రజాసేవ అని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఇంకా ప్రాథమిక సదుపాయాల కొరత ఉందని సీతక్క వెల్లడించారు. గుట్టలు కరిగిపోతున్నాయని.. సహజ వనరులు క్షీణిస్తున్నాయన్నారు. గ్రామ పంచాయతీలు, గ్రామసభలను మరింత బలోపేతం చేయాలన్నారు. పీసా అమలులోని సవాళ్లకు వర్క్‌షాప్ చర్చలు పరిష్కార మార్గాలు చూపాలని తెలిపారు. 'సర్పంచ్ సంవాద్' ద్వారా 4,500 మంది సర్పంచులు ఒకే వేదికపైకి వచ్చారన్నారు. సాంకేతికతతో గ్రామీణ పాలనను మరింత సమర్థవంతం చేస్తున్నామని తెలిపారు. పీసా అమలు పుస్తకాలకే పరిమితం కాకూడదని.. గ్రామస్థాయిలో ఫలితాలు కనిపించాలన్నారు. ఆదివాసీల స్వపరిపాలన స్ఫూర్తిని కార్యరూపంలోకి తీసుకురావాలని తెలిపారు. పీసా చట్టం అమలుకు గ్రామసభల నిర్ణయాలకు గౌరవం కల్పించాలన్నారు.

# రేవంత్ రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదు



**తెలంగాణలో ఇక బిజెపిదే తదుపరి అధికారం**

**బిజెపి ఎంపి ధర్మపురి అర్వింద్ జోస్యం**

బలగం టీవి, భువనగిరి

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డికి ఘోర ఓటమి తప్పదని నిజామాబాద్ ఎంపీ, బీజేపీ నేత ధర్మపురి అర్వింద్ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డికి చదువు రాదని ఆయన వ్యంగ్యంగా అన్నారు. బుధవారం భువనగిరిలో ఎంపీ ధర్మపురి అర్వింద్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్‌పై ఈ రాష్ట్రంలో కేసు ఉన్నట్లు ఎన్నికల సంఘానికి ఎలా తెలిసిందంటూ సందేహం వ్యక్తం చేశారు. ఇది రేవంత్ రెడ్డి కుట్రో, కాంగ్రెస్ పార్టీ కుట్రో వాళ్లే తెలుసుకోవాల్సి ఉందని బీజేపీ ఎంపీ అభిప్రాయపడ్డారు. బీజేపీ నాయకుల మధ్య అభిప్రాయ బేధాలు ఉండడం సహజమన్నారు. నరేంద్రమోడీ చరిష్మాను ఓట్లుగా మార్చుకోవడంలో తెలంగాణ బీజేపీ విఫలమైందని విమర్శించారు. అక్రమ ఇసుక రవాణాకు లారీలు దొరుకుతున్నాయి.. కానీ ధాన్యం రవాణాకు దొరకడం లేదా? అంటూ ఆయన అనుమానం వ్యక్తం చేశారు. త్రిపుర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో కంటే తెలంగాణలో బీజేపీ విజయం సాధించడం సులభమన్నారు. తెలంగాణ ప్రభుత్వం గత రెండేళ్లుగా భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కి 32 లక్షల టన్నుల బియ్యం బకాయిగా ఉందని చెప్పారు. నెహ్రూ ప్రధానిగా ఉన్న సమయంలో ప్రతిపక్షం లేదన్నారు. కానీ నేడు చాలా ప్రతిపక్షాలు ఉన్న సమయంలో 12 ఏళ్ల పాటు మోదీ ప్రధానిగా ఉన్నారని ఎంపీ అర్వింద్ వివరించారు.

# బిజెపిని ప్రజలకు చేరువ చేయడంలో మోడీ విజయం

**ప్రాంతీయ పార్టీల నేతలు మోడీతో దోస్తీకి రెడీ**

**విజయం సాధించడమే లక్ష్యంగా మోడీ ఎత్తులు**

**ప్రజలతో నేరుగా కనెక్ట్ అయ్యేలా కార్యక్రమాలు**

బలగం టీవి, న్యూఢిల్లీ

బిజెపి అంటే ఒకప్పుడు అంటరాని పార్టీ. బీజేపీ అంటే బ్రాహ్మణుల పార్టీ అనే భావన. కానీ ఇప్పుడా భావన లేదు. బిజెపి సిద్ధాంతాలను పూర్తిగా మార్చేసిన ఘనత మోడీదే. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలకు సముచిత ప్రాధాన్యం ఇచ్చారు. అలాగే బీజేపీలో చేరాలంటే ఆరెస్సెస్ బ్యాక్ గ్రౌండ్ ఉండాలనే నిబంధనలకు నీళ్లొదిలారు. ఎవరైనా చేరొచ్చని, బీజేపీ కూడా మిగతా పార్టీల్లాంటిదేనని లిబరల్ లుక్ ఇచ్చారు. బీజేపీ అంటే పెద్దగా ఆసక్తి లేనివాళ్లు, అసలు రాజకీయాలపై ఇంట్రస్ట్ లేని వాళ్లు కూడా మోడీని చూసి పార్టీలో చేరుతున్నారని బీజేపీ నేతలే ఒప్పుకుంటున్న పరిస్థితి. ఆ స్థాయిలో బీజేపీలో మోడీ హవా నడుస్తోంది. వరుస ఎన్నికల్లో విజయాలు ఆయనకు ఆషామాషీగా రాలేదు. అవినీతి కనిపించని

పాలన, జనాన్ని ఆకట్టుకునే ప్రసంగాలు, ప్రత్యర్థుల్ని ఆశ్చర్యపరిచే వ్యూహాలు.. ఇలా మోడీ అమ్ముల పొదిలో చాలా అస్త్రాలున్నాయి. దేశంలో కాంగ్రెస్ ధాటికి తట్టుకోలేక ప్రాంతీయ పార్టీల ప్రాపకం కోసం చూస్తున్న బీజేపీకి.. మోడీ ఆశాకిరణంలా దొరికారు. ఇప్పుడు బీజేపీతో పొత్తు పెట్టుకోవడానికి అన్ని పార్టీలూ అర్రులు చాస్తున్నాయంటే.. దానికి మోడీ మ్యాజిక్కే కారణం.కింది స్థాయి నుంచి అంచెలంచెలుగా బీజేపీలో ఎదిగిన మోడీ.. ఇప్పుడు పార్టీలో సర్వంసహా ఆధిపత్యాన్ని సంపాదించారు. మరే నేతకూ సాధ్యం కాని రీతిలో కొంతవరకు వ్యక్తిపూజ సంస్కృతిని కూడా తీసుకొచ్చారు. పార్టీ స్వరూపాన్ని పూర్తిగా మార్చేశారు. దేశంలో రాజకీయం చేయడం ఒక ఎత్తైతే.. ఎన్నికల రాజకీయం మరో ఎత్తు. చాలా మంది నేతలకు ఈ సూక్ష్మం తెలియకే రాజకీయ తెరపై కొంతకాలం వెలిగి తెరమరుగైపోతున్నారు. కానీ మోడీ మాత్రం ఎన్నికల రాజకీయాన్ని పూర్తిస్థాయిలో ఔపోసన పట్టారు. అసలు ఎన్నికలు అంటే ప్రజాస్వామ్య పండగ అని ప్రకటించిన తొలి అగ్రనేత మోడీనే అంటే అతిశయోక్తి కానే కాదు. మిగతా నేతల్లా ఎన్నికలప్పుడే వాటి గురించి ఆలోచించే నేత కాదు మోడీ. అనుక్షణం ఎన్నికల చుట్టే ఆయన ఆలోచనలు తిరుగుతాయి. ప్రధానిగా లోక్‌సభ ఎన్నికల్లో గెలిస్తే చాలనుకునే వ్యక్తి కూడా కాదు. లోక్‌సభ ఎన్నికల్లో విజయం దక్కింది కొన్నాళ్లు రిలాక్స్ అవుదాం అని కూడా మోడీ ఆలోచించరు. ఎప్పటికప్పుడు జరుగుతున్న ఎన్నికల గురించే కాకుండా.. జరగబోయే ఎన్నికల గురించి కూడా ఆలోచించటం ఆయన నైజం. అంతకుముందు ఎన్నికలొస్తే చాలు అన్ని పార్టీల మాదిరే బీజేపీ కూడా టెన్షన్ పడేది. పైస్థాయి నేతలకు తగ్గట్టుగానే కిందిస్థాయిలో కార్యకర్తలు కూడా తీవ్ర ఒత్తిడిలో ఉండేవారు. కానీ మోడీ వచ్చాక ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇప్పుడు మిగతా పార్టీలకు భిన్నంగా ఎన్నికలు వస్తే బీజేపీ మరింత ఉత్సాహంగా పనిచేస్తోంది. పై స్థాయి నుంచి కిందిస్థాయి సరికొత్త వ్యూహరచన కనిపిస్తోంది. దీనికి మోడీ ఇచ్చిన స్ఫూర్తే కారణమని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఎన్నికల్ని పండగలా సెలబ్రేట్ చేసుకుని.. ప్రజల ఆశీర్వాదం తీసుకునే అద్భుత అవకాశంగా చూడాలనే మోడీ సరికొత్త థియరీ.. ఎన్నికల విషయంలో బీజేపీ దృక్పథాన్నే మొత్తంగా మార్చేసింది. అప్పటి నుంచి ఆ పార్టీకి ఎప్పుడూ ఊహించని ఫలితాలు చాలా అలవోకగా వస్తున్నాయి. కొన్నిసార్లు బీజేపీ సాధిస్తున్న ఫలితాల్ని చూసి.. ప్రత్యర్థులు కూడా ఏదో జరిగిందని అనుమానించే పరిస్థితి. కొందరు ప్రత్యర్థులు బీజేపీ గెలుపు సూత్రాల్ని కొంతవరకు అర్థం చేసుకున్నా.. ఇంతవరకూ ఎవరూ పూర్తిస్థాయిలో మోడీ నాయకత్వంలోని బీజేపీ ఎన్నికల పద్మవ్యూహాన్ని ఛేదించలేకపోయారు. ఎన్నికల విషయంలో మోడీ పనితీరు, ఆలోచన పద్ధతి ఎలా ఉంటుందో చెప్పటానికి ఆయన సుదీర్ఘ రాజకీయాన్ని పరిశీలించాల్సిన పని లేదు. గత రెండేళ్ల కాలంలో ఆయన వ్యవహారశైలి చూస్తే సరిపోతుంది. ఎన్నికల ప్రచారం విషయంలో మోడీకి విసుగు లేదు. అలుపు రాదు. తాను ప్రచారం చేసే రాష్ట్రంలో బీజేపీ గెలుపు అవకాశాలు, పార్టీ అస్తిత్వం.. ఇవేవీ ఆయనసలు పట్టించుకోరు. ఏ రాష్ట్రంలో అయినా.. ఏ ప్రాంతంలో అయినా బీజేపీ జెండా ఎగిరేలా చేయటానికి తనకు చేతనైనంత పని చేయాలనే ఏకైక లక్ష్యంతో మోడీ పనిచేస్తారు. ఎన్నికల ప్రచారం అంటే మూస పద్ధతుల్లో కాకుండా.. రాష్టాన్ని బట్టి.. అక్కడి ప్రజల ఆలోచన తీరును బట్టి.. శైలి మార్చుకోవాలని ఆయన సూచిస్తారు. స్వయంగా పాటిస్తారు కూడా. బీజేపీ ఎంత ప్రచారం చేసినా.. దక్షిణాదిలో అనుకున్న ఫలితాలు రావడం లేదన్న ఆ పార్టీ నేతల మాటల్ని ఆయన లైట్ తీస్కుంటారు. గెలిచేదాకా ప్రచారం చేస్తూనే ఉండాలంటారు. ఆ పట్టుదలతోనే గతంలో బీజేపీ గెలవని ఈశాన్య, తూర్పు రాష్ట్రాల్లో గెలిచిందనేది మోడీ నమ్మకం. ఇప్పటివరకూ కాషాయ పార్టీ ఖాతా తెరవని రాష్ట్రాల్లోనూ ఇదే సూత్రం అమలుచేయాలనేది మోడీ

వ్యూహం. ఇక్కడ కేవలం వ్యూహరచన చేయటమే కాదు.. ఆ వ్యూహాన్ని కచ్చితంగా అమలు చేయడంలోనూ ఆయన ఎప్పుడూ వెనకడుగు వేయరు. మొన్నటి ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో తలమునకలై ఉన్న మోడీ.. ఆ రాష్ట్రాల్లోప్రచారం చేస్తూనే.. వచ్చే ఏడాది ఎన్నికలు జరిగే పంజాబ్‌లోనూ ప్రచారానికి వెళ్లారు. అలా చూసుకుంటే.. ఎన్నికల ప్రచారం విషయంలో మోడీ అందరికంటే ముందుం టారని చెప్పాలి. మోడీ ఎన్నికల ప్రచారం కూడా భిన్నంగానే ఉంటుంది. తన ప్రచారానికి ఎంత ఫలితం వచ్చిందో.. తనకు తానుగా బేరీజు వేసుకుంటారు. పార్టీలో తనను అడిగేవారు ఎవరూ లేకపోయినా.. ఆత్మసాక్షికి సమాధానం చెప్పుకునేలా పనిచేయాలనుకుంటారు మోడీ. ఈ చిత్తశుద్ధితో ప్రచారం చేస్తారు కాబట్టి.. మోడీ రోడ్‌షోలు, సభలు.. చాలావరకు విజయవంతమౌతాయి. దేశంలో ఎక్కువ మంది జనం మోడీతో నేరుగా కనెక్టవుతున్నారు. భిన్నాభిప్రాయాలున్నా.. భిన్నమైన రాజకీయ పార్టీల సానుభూతి పరులుగా ఉన్నా..ఏ సందర్భంలో అయినా మోడీతో కనెక్ట్ అవుతున్నారు. మార్కెటింగ్ లో కీలకంగా భావించే పబ్లిక్ రిలేషన్ అనే పాయింట్ ను మోడీ ప్రభావశీలంగా ఉపయోగిస్తున్నారు. సక్సెస్ కూడా అవుతున్నారు. మెజార్టీ ప్రజలతో మోడీ నేరుగా సంబంధం పెట్టుకున్నారు. మోడీ మన మనిషి అని చాలా మంది అనుకునేలా చేసుకుంటున్నారు. జనంతో మోడీకి ఉన్న ఈ కనెక్షన్ సిద్ధాంతాలు, భావజాలాలు, పార్టీలకు అతీతంగా పనిచేస్తోందని ఎన్నికల ఫలితాలు చెబుతున్నాయి. ఈ బలమైన బంధమే మోడీని విజేతగా నిలబెడుతోంది.

# ఫ్రెండ్లీ పోలీసింగ్ సాధారణ ప్రజలకు మాత్రమే

**రౌడీలు, గూండాల పట్ల కఠినంగానే వ్యవహరిస్తాం**

**గంజాయి సాగు చేస్తే రైతు సంక్షేమ పథకాలు నిలుపుదల**

**సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచుతున్నాం**

**రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ స్పష్టీకరణ**

బలగం టీవి, ఆదిలాబాద్



తెలంగాణలో పోలీసింగ్ విధానంలో కీలక మార్పులకు సంకేతాలు ఇస్తూ డీజీపీ సీవీ ఆనంద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇకపై 'ఫ్రెండ్లీ పోలీసింగ్' అనే పేరుతో నేరస్తుల పట్ల సానుభూతి ఉండదని, ప్రజలను గౌరవిస్తాం.. కానీ రౌడీలు, గుండాలను ఏమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో మావోయిజం పూర్తిగా అంతమైందన్నారు. ఈ నేపథ్యంలో గ్రేహౌండ్స్ విభాగాన్ని పునర్వ్యవస్థీకరించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. గ్రేహౌండ్స్‌లో పనిచేస్తున్న సిబ్బందిని కొత్త విభాగాలకు బదిలీ చేస్తూ, వారి సేవలను ఇతర కీలక రంగాల్లో వినియోగించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రానికి గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా పెద్ద సవాల్‌గా మారిందని డీజీపీ పేర్కొన్నారు. వాటి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. డ్రగ్స్ ముఠాలపై నిరంతర నిఘా కొనసాగుతుందని, నేరస్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భూపాలపల్లి, ఏటూరు నాగారం, నర్సంపేట, ఆదిలాబాద్ తదితర అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగు ఉందని ప్రస్తావించారు. గంజాయి సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందవని, రైతుబంధు కూడా నిలిపి వేస్తున్నామని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు.అదేవిధంగా సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, సైబర్ క్రైమ్ ఇప్పుడు పోలీసు శాఖకు ప్రధాన సవాల్‌గా మారిందని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సైబర్ నేరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆదిలాబాద్ జిల్లా పోలీసులు అద్భుతంగా పనిచేస్తున్నారని డీజీపీ ప్రశంసించారు. మారుతున్న నేరాల స్వరూపానికి అనుగుణంగా పోలీసు వ్యవస్థ సైతం మారాల్సిన అవసరం ఉందని, ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఇక, ప్రజలకు భరోసా ఇచ్చే పోలీసింగ్ కొనసాగుతుంది. కానీ చట్టాన్ని చేతిలోకి తీసుకునే రౌడీలు, గూండాలకు మాత్రం కఠినమైన పోలీసింగ్ తప్పదనే విషయం గుర్తుంచుకోవాలని డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరించారు. పోలీసుస్టేషన్‌కు వచ్చిన బాధితులతో ఫ్రెండ్లీగా ఉంటామని వ్యాఖ్యానించారు. రౌడీషీటర్లు, తదితర నేరస్తుల విషయంలో కఠినంగానే ఉంటామని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది పెట్టే ఎవరినీ కూడా వదలబోమని స్పష్టం చేశారు. తెలంగాణలో నక్సలైట్ల సమస్య లేదని తెలిపారు. దేశవ్యాప్తంగా ఏడాది కాలంలో రోడ్డుప్రమాదాల్లో..1.70 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారని డీజీపీ చెప్పుకొచ్చారు. ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్‌పై ప్రజలు యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు. మైనర్ల డ్రైవింగ్.. దేశంలో పెద్ద సమస్యగా మారిందని తెలిపారు. తల్లిదండ్రులు వారికి వాహనాలు కొనిస్తున్నారని.. అందువల్లే ఇబ్బందులు వస్తున్నాయని వివరించారు. అన్నీ సమస్యలు పోలీసులతోనే పరిష్కారం కావని... ప్రజల సహకారం చాలా అవసరమని చెప్పుకొచ్చారు.

# దేశంలో ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శం




- అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవి, హైదరాబాద్**

దేశంలో ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శమని,ఇటీవల తమిళనాడు సి ఎం గా ప్రమాణ స్వీకారం చేసిన విజయ్ తెలంగాణ రాష్ట్రంలో సి ఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం పై, కేరళ సి ఎం మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం పై మొదటి సంతకం చేశారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు .99 రోజుల ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా వేములవాడ మున్సిపల్ పరిధిలోని 11, 24 వార్డుల్లో గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక వార్డు సభ , వేములవాడ రూరల్ మండలం మల్లారం గ్రామంలో ప్రత్యేక గ్రామ సభలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు..ఈ సందర్భంగా గ్రామ , వార్డు సభలో వర్షాకాల ముందస్తు చర్యలు, జల సంరక్షణ, వన మహోత్సవం, సురక్షిత తాగునీరు, వ్యవసాయ రంగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మహిళా సంరక్షణ, వర్షాకాల సన్నద్ధత, పంటల మార్పిడి, వ్యవసాయ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, పారిశుద్ధ్యం, వన మహోత్సవం, జల సంరక్షణ, మహిళల రక్షణ, భరోసా కేంద్రం తదితర అంశాలపై గ్రామ ప్రజలతో సుదీర్ఘంగా చర్చించి అవగాహన కల్పించారు. అనంతరం ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రభుత్వ పథకాలు, సంక్షేమ అభివృద్ధి పనులు ప్రజల్లోకి తీసుకువెళ్లడం, సంపూర్ణ అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలు చేస్తున్నారని పేర్కొన్నారు.

వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఘన వ్యర్థాల నిర్వహణను సమర్ధవంతంగా అమలు చేయాలని అన్నారు.. జల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. మహిళల భద్రత, రోడ్డు భద్రత అంశాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.వర్షాకాలానికి ముందే గ్రామాల్లోని డ్రైనేజీలు శుభ్రం చేయించాలని తెలిపారు. డ్రైనేజీల్లో ప్లాస్టిక్, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయవద్దని కోరారు.రాష్ట్రంలో కుల గణన చేసిన తర్వాత నరేంద్ర మోదీ దిగి వచ్చి దేశంలో జనగణ కార్యక్రమాన్ని చేపట్టారని అన్నారు.. ఆయిల్ పామ్, సన్న వడ్లు, కూరగాయలు, పప్పు ధాన్యాలు తదితర లాభదాయక పంటలను సాగు చేయడానికి రైతులు ముందుకు రావాలని సూచించారు. .జగిత్యాల జిల్లా పొలస తరహాలో మర్రిపల్లిలో 40 ఎకరాల్లో నిర్మాణం చేస్తున్నమని అన్నారు.. తద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు..

వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు రూ.150 కోట్లతో కొనసాగుతున్నాయని, మరో వెయ్యి ఏండ్ల పాటు ఆలయం ఉండేలా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ఊపు అందుకున్నాయని, దేశానికి రోల్ మోడల్ ఈ పథకమని పేర్కొన్నారు. సొంత ఇంటి కల నిజం చేసేందుకు రూ.5 లక్షలు ఇస్తున్నామని అన్నారు . ఇందిరమ్మ ఇండ్లు సొంత ఇల్లు కల నిజం చేయడంతో పాటు ఎందరికో ఉపాధి మార్గం దొరుకుతుందని తెలిపారు. త్వరలో రెండో దశలో అర్హులకు ఇస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు,ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుంద రెడ్డి, ఆర్డీవో కే ఎస్ బి కుమారి, కమిషనర్ లోకేష్ ,డీఎస్పీ శ్రీనివాస్,మండల ప్రత్యేక ఆఫీసర్ లక్ష్మి రాజం,మల్లారం సర్పంచ్ అర్పిత రెడ్డి, ఇతర అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు..

# టెక్స్‌టైల్ పార్క్ పై జిల్లా కలెక్టర్ సమీక్ష

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్క్ పై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్క్‌లోని వివిధ అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో చేనేత జౌళి శాఖ అధికారులు, పరిశ్రమల శాఖ, ఇరిగేషన్ శాఖ, మిషన్ భగీరథ శాఖలకు చెందిన అధికారులు,టెక్స్‌టైల్ పార్క్ అసోసియేషన్ బాధ్యులతో బుధవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు జారీ చేస్తూ, టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధికి అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్లాట్ల బదిలీ, ఎన్ఓసీల జారీకి సంబంధించి అందిన అర్హత కలిగిన దరఖాస్తులను వీలైనంత త్వరగా స్టేట్ లెవల్ కమిటీ సమావేశంలో పరిశీలనకు ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టెక్స్‌టైల్ పార్క్‌కు నీటి సరఫరా కోసం ఇరిగేషన్ మిషన్ భగీరథ అధికారులతో కలిసి టెక్స్‌టైల్ పార్క్‌కు నీటి లభ్యత ఉన్న ప్రత్యామ్నాయ వనరులను గుర్తించాలని సూచించారు. టెక్స్‌టైల్ పార్క్‌లో ఏర్పాటు చేసిన కామన్ ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వినియోగంలోకి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. భవిష్యత్తులో డైయింగ్, ప్రాసెసింగ్ వంటి యూనిట్లు ఏర్పాటు అయితే సీఈటీపీ సమర్థవంతంగా వినియోగించుకునేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కామన్ ఫెసిలిటీ సెంటర్ పై సమగ్ర ప్రతిపాదన సిద్ధం చేయాలని ఆదేశించారు.సమావేశంలో చేనేత, జౌళి సహాయ సంచాలకులు సంతోష్ కుమార్, ఈఈ




మిషన్ భగీరథ ముజాహిబ్ అన్వర్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం హన్మంతు, టెక్స్‌టైల్ పార్క్ అసోసియేషన్ సభ్యులు, యూనిట్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్ తరాల కోసం పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత..



**- ఎస్పీ మహేష్ బి. గితే**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన మరియు కాలుష్య రహిత పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎస్పీ మహేష్ బి. గితే పాల్గొని, పోలీస్ అధికారులు మరియు సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు.?ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా అటవీ సంపద తగ్గిపోతుండటం, పచ్చదనం స్థానంలో కాంక్రీట్ నిర్మాణాలు పెరగడం మరియు పారిశ్రామిక, వాహన కాలుష్యాల కారణంగా పర్యావరణ సమతుల్యత తీవ్రంగా దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల వాతావరణంలో వస్తున్న గణనీయమైన మార్పుల కారణంగా అకాల వర్షాలు, అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, ఇవి ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అన్నారు.ప్రస్తుత పరిస్థితులకు ప్రధాన కారణం పచ్చదనం తగ్గిపోవడమేనని అన్నారు.

?ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి, విస్తృత స్థాయిలో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కేవలం మొక్కలు నాటడమే కాకుండా, వాటిని సంరక్షించడం ద్వారానే రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించగలమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐలు రవి, మధుకర్, ఆర్ఐలు మధుకర్, సురేష్, రమేష్‌లతో పాటు వివిధ స్థాయిల పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇల్లంతకుంట లో ఘనంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి జన్మదిన వేడుకలు




**బలగం, టీవీ ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండల కేంద్రం తో పాట పలు గ్రామాల్లో మానకొండూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం లోని బస్టాండ్ ఆవరణలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున చేరుకొని కేక్ కట్ చేసి కవ్వంపల్లి జన్మదిన సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ మానకొండూర్ అభివృద్ధి ప్రదాత కవ్వంపల్లి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండి ప్రజలకు మరింత సేవ చేస్తూ ఉన్నత పదవులు అధిరోహించాలని భగవంతుడిని వేడుకుంటున్నట్లు అయన తెలిపారు. ఈ కార్యక్రమం లో స్థానిక సర్పంచ్ మామిడి రాజు, వొల్లాల రజిత వెంకటేష్, పండుగ సునీత, వివిధ గ్రామాల సర్పంచ్ లు, మాజి ఎంపీపీ గుడిసె ఐలయ్య యాదవ్ యాస తిరుపతి,సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# భూ సేకరణ పనులు వేగవంతం చేయాలి.

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:**

జిల్లాలోని వివిధ నీటి పారుదల ప్రాజెక్టులు, రైల్వే లైన్ నిర్మాణం కోసం భూ సేకరణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లాలోని వివిధ నీటి పారుదల ప్రాజెక్టులు, రైల్వే లైన్ నిర్మాణం, వీటీఏడీఏ తదితర అంశాలపై వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు.కాళేశ్వరం ప్రాజెక్టు, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు, ఇతర ప్రాజెక్టులు, రైల్వే లైన్ నిర్మాణం, వీటీఏడీఏ తదితర నిర్మాణాలు, ప్రస్తుత పరిస్థితిపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు.

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ .. ప్రాజెక్టుల కోసం భూ సేకరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించారు.సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాస్, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్, నీటి పారుదల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కొనుగోళ్ళు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి..

**-అదనపు కలెక్టర్ గడ్డం నగేష్**

**బలగం టీవీ,వేములవాడ :**

ధాన్యం కొనుగోళ్ళు త్వరితగతిన పూర్తి చేసే దిశగా కొనుగోళ్ళ ప్రక్రియలో వేగం పెంచాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. మంగళవారం వేములవాడ రూరల్ మండలం లింగంపల్లి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, చందుర్తి మండలం జోగాపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు.ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తి చేయడంపై కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఆయా కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యం వివరాలను బాధ్యులను అడిగి ఆరా తీశారు. తూకం వేసిన ధాన్యం మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న రైతులతో మాట్లాడి పంట మార్పిడి చేయాలని, లాభదాయక పంటలను సాగు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.



# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలి..

**- సీఐ ఓ.వెంకటేష్**

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**

పర్యావరణ పరిరక్షణకు చెట్లు ఎంతో మేలు చేస్తాయని,ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి అని మొక్కలు ,చెట్లు ప్రజలకు స్వచ్ఛమయిన ఆక్సిజన్ ను అందిస్తాయని తద్వారా ప్రజలందరూ ఆరోగ్యంగా జీవించే పరిస్థితులు ఏర్పడతాయని ఎల్లారెడ్డి పేట సి ఐ ఓ .వెంకటేష్ తెలిపారు.ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్ పరిసరాలలో సీఐ వెంకటేష్ మొక్కలు నాటారు.ఆయన ఆధ్వర్యంలో పలువురు పోలీసులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సిఐ వెంకటేశ్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మన ఆరోగ్యం బాగుండాలన్నా,భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా జీవించాలన్న ప్రతి వారు తమ ఇళ్లలో,రహదారుల ప్రక్కన,పంట చేల గట్లపై విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లు రాహుల్ రెడ్డి ,సయ్యద్ అబ్దుల్ రజాక్, హెడ్ కానిస్టేబుళ్లు షబ్బీర్ అలీ , షబ్బీర్ , కానిస్టేబుల్ పరుశురాములు, యాకూబ్ లు పాల్గొన్నారు.



# అగ్గిపెట్టెలో చీరను చూసి ముగ్ధులైన విద్యార్థులు.

## సిరిసిల్లలో ఇన్ఫినిటీ కాలేజ్ బృందం సందడి

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

నిజామాబాద్‌లోని ఇన్ఫినిటీ కాలేజ్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్‌కు చెందిన విద్యార్థులు బుధవారం సిరిసిల్లలో పర్యటించి, చేనేత కళాత్మకతపై ప్రత్యక్ష అవగాహన పొందారు. ఈ పర్యటనలో భాగంగా ప్రముఖ చేనేత కళాకారుడు హరిప్రసాద్‌ను కలిసిన విద్యార్థులు, వస్త్ర తయారీలో ఉండే మెలకువలను అడిగి తెలుసుకున్నారు. సాధారణ దారం నుంచి అద్భుతమైన రంగులు, ఆకర్షణీయమైన డిజైన్లతో చీరలు ఎలా రూపుదిద్దుకుంటాయనే ప్రక్రియను హరిప్రసాద్ విద్యార్థులకు ప్రాక్టికల్స్‌తో సహా వివరించారు.

ప్రధానంగా, అగ్గిపెట్టెలో పట్టేంత అతి తక్కువ మందంతో నేసే చీరలు, ఉంగరం మరియు సూది రంధ్రం గుండా దూరేలా నేసే కళాత్మక చీరల తయారీ వెనుక ఉన్న కష్టాన్ని, నైపుణ్యాన్ని చూసి విద్యార్థులు ఆశ్చర్యపోయారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఎదుగుదల, అందులోని సాంకేతిక అంశాలను విశ్లేషించిన హరిప్రసాద్, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ పర్యటన తమకు ఒక గొప్ప పాఠంగా మారిందని, భవిష్యత్తులో తాము రూపొందించే డిజైన్లకు హరిప్రసాద్ అందించిన విలువైన సూచనలు ఎంతో దోహదపడతాయని విద్యార్థులు అభిప్రాయపడ్డారు. విద్యార్థుల బృందానికి ప్రొఫెసర్లు మాధురి మదాసో మరియు అక్షర తుంగేన మార్గనిర్దేశం చేశారు.

## పోక్సో కేసులో నిందితుడుకి 20 ఏళ్లు జైలు శిక్ష..

**-రు.5000/- జరిమానా..**

**-నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకోలేరు**

**-ఎస్పీ మహేష్ బి. గితే**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో నిందుతుడీకి 20 సంవత్సరాలు జైలు ,5000/- రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల పోక్సో కోర్టు ప్రధాన న్యాయమూర్తి రాధికా జైస్వాల్ మంగళవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ మహేష్ బి. గితే ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ

గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మైనర్ బాలికను గోరింటాల గ్రామానీకి చెందిన కోటగిరి శ్రీనివాస్ అనే వ్యక్తి వేధింపులకి గురి చేయగా బాధితురాలి తండ్రి ఫిర్యాదు మెరకు గంభీరావుపేట పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి అప్పటి సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి దర్యాప్తు అనంతరం నిందితుడిని రిమాండ్ కి తరలించి, అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలుచేశారు అని అన్నారు.కోర్టు విచారణలో భాగంగా అదనపు ఎస్పీ చంద్రయ్య పర్యవేక్షణలో కోర్టు మానిటరింగ్ ఎస్ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్, సి ఎం సి కానిస్టేబుళ్ నవీన్, పోక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల కోర్టులో 15 మంది సాక్షులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుపున గత పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్ వాదించగా, శాస్త్రీయ ఆధారాలు, సాక్షులను పరిశీలించిన న్యాయమూర్తి నేరము రుజువు కావడంతో నిందితుడైన కోటగిరి శ్రీనివాస్ కి 20 సంవత్సరాలు జైలు శిక్ష , 5000/–జరిమాన విధించారని తెలిపారు.సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకోలేరని , శిక్షల ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని అన్నారు.పోలీసులు మరియు ప్రాసిక్యూషన్ సమన్వయంతో వ్యూహాత్మకంగా న్యాయ విచారణ,న్యాయ నిరూపణ నిర్వహించి నిందితులకు తప్పనిసరిగా శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు.ఈకేసులో పకడ్బందీగా దర్యాప్తు చేపట్టి నిందితునికి శిక్ష పడటంలో కృషి చేసిన అదనపు ఎస్పీ చంద్రయ్య, అప్పటి డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, ప్రస్తుత డిఎస్పీ నాగేంద్రచారి,పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్,గంబిరావుపేట ఎస్ఐ శ్రీకాంత్,కోర్టు మానిటరిశీగ్ ఎస్ఐ రవీందర్ నాయుడు,కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్, సిఎంసి కానిస్టేబుల్ నవీన్,పోక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల లను ఎస్పీ ఎస్పీ మహేష్ బి. గితే అభినందిచారు



## ధాన్యం అన్ లోడింగ్ వేగవంతం చేయాలి

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

ధాన్యం అన్ లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని, హమాలీల సంఖ్యను పెంచి, అన్ లోడింగ్ పూర్తి చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. మంగళవారం సిరిసిల్ల మున్సిపల్ పరిధి సర్దాపూర్ లోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాముల్లో ధాన్యం అన్ లోడింగ్ చేస్తున్న తీరును అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ క్షేత్ర స్థాయిలో పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.వాహనాల్లోని ధాన్యం హమాలీల సంఖ్యను మరింత పెంచి అన్ లోడింగ్ వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని, అన్ లోడ్ అయిన వాహనాలను ధాన్యం లోడింగ్ కోసం ఇతర కేంద్రాలకు తరలించాలని సూచించారు. వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాముల్లో ధాన్యం నిల్వ చేస్తున్న తీరు, గోదాముల సామర్థ్యం వివరాలను అధికారులను అడిగి ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాల నుండి వాహనాలను జాప్యం చేయకుండా లోడింగ్ చేసి తరలించేలా పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు.సందర్శనలో పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, సిరిసిల్ల, వేములవాడ తహసీల్దార్లు మహేష్, జయంత్ తదితరులు ఉన్నారు.

## నేరాల నియంత్రణతో పాటు కేసులను త్వరితగతిన ఛేదించాలి..

**- ఎస్పీ మహేష్ బి. గితే.**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

జిల్లాలో నేరాల నియంత్రణతో పాటు నమోదైన కేసులలో నాణ్యమైన దర్యాప్తుతో నిందితులకు శిక్ష పడేలా చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం అందించేలా పనిచేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అధికారులకు ఆదేశించారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం సిరిసిల్ల సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ జిల్లాలో సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి నేరాల నివారణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి నేరాల దర్యాప్తు, నేరస్తుల గుర్తింపు, కేసుల నిర్వహణలో వేగం, పారదర్శకత పెంచాలని తెలిపారు.సీసీటీఎన్ఎస్ 2.0 మరియు ఈ–సాక్ష్య వ్యవస్థలను పూర్తిస్థాయిలో వినియోగించి డిజిటల్ ఆధారాల సేకరణ, భద్రపరిచే ప్రక్రియను మరింత బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు.సివిల్,భూ వివాదాలపై అనుసరించాల్సిన ప్రామాణిక విధానాలు గురించి పోలీస్ అధికారులకు స్పష్టమైన అవగాహన ఉండాలని పేర్కొన్నారు.దొంగతనాల నివారణకు ప్రతి సర్కిల్ పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అసాంఘిక కార్యకలాపాలు అయిన గంజాయి,ఇసుక, పిడియాస్ రైస్ అక్రమ రవాణా , గ్యాంబ్లింగ్ పై ఆకస్మిక తనిఖీలు చేపడుతూ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో గంజాయి కేసులలో నిందుతులుగా ఉన్న వారిపై నిఘా ఉంచలని, గంజాయి కిట్ల సహాయంతో యూరిన్ టెస్ట్ లు నిర్వహించి గంజాయి తాగే వారిని, వారికి సరఫరా చేసే వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని అధికారులకు సూచించారు.పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రతి రోజు సాయంత్రం వాహనాల తనిఖీలు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.బహిరంగ ప్రదేశాల్లో మద్యపాన సేవనాన్ని అరికట్టేందుకు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతిరోజూ సాయంత్రం ప్రత్యేక తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రజలకు రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, మాధకద్రవ్యాల వలన కలుగు అనర్థాలపై,మహిళ భద్రత మొదలు అంశాలపై అగహన కల్పించాలన్నారు. ఈసమావేశంలో డిఎస్పీ నాగేంద్రచారి, సిఐ లు శ్రీనివాస్, నాగేశ్వరరావు, వెంకటేష్, మొగిలి, ఎస్ఐ లు ,ఐటి కోర్ సిబ్బంది, డిసిర్బీ సిబ్బంది పాల్గొన్నారు.



## పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి..

**-బీఆర్ఎస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జ్ తూల ఉమా**

**బలగం టీవీ,:ఎల్లారెడ్డిపేట**

బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు నియోజక వర్గ ఇంచార్జి తుల ఉమ అన్నారు . ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో సభ్యత్వ నమోదు కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా తూల ఉమా హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజలకు భరోసాగా నిలవాలను తెలిపారు. ప్రతి బూతు ఇంచార్జి బాధ్యతగా పనిచేసి సభ్యత్వాలు పెంచేలా కృషిచేయాలని అన్నారు.ఈ నెల 13న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో బూతు ఇంచార్జిలతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇక్కడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వర్స కృష్ణహరి, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఎల్లారెడ్డిపేట సర్పంచ్ ఎలగందుల నరసింహులు, మాజీ జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, మాజీ ఎంపీపీ పిల్లి రేణుక, నాయకులు కుంబాల మల్లారెడ్డి, గుల్లపల్లి నర్సింహారెడ్డి, ఎడ్ల సందీప్, అప్సరున్నీసా, కొర్రి అనిల్, సింగారం మధు, దేవరాజు ,పలు గ్రామాల బీఆర్ఎస్ కార్యకర్తలు హాజరయ్యారు.

# చెత్తను పక్కాగా వేరు చేయాలి..

**-పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యులు కావాలి**

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, వేములవాడ**



ప్రతి ఇంటిలో చెత్తను నాలుగు రకాలుగా పక్కాగా తడి, పొడి, సానిటరీ, ప్రత్యేక చెత్త గా వేరు చేసి గ్రామ పంచాయతీ వాహనానికి అందించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు.ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రుద్రంగి మండలం మానాలలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ .. ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రభుత్వ పథకాలు, సంక్షేమ అభివృద్ధి పనులు ప్రజల్లోకి తీసుకువెళ్లడం, సంపూర్ణ అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలు చేస్తున్నారని పేర్కొన్నారు.వర్షాకాలానికి ముందే గ్రామాల్లోని డ్రైనేజీలు శుభ్రం చేయించాలని తెలిపారు. డ్రైనేజీల్లో ప్లాస్టిక్, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయవద్దని కోరారు. ఘన వ్యర్థాల నిర్వహణ –2026 పై ప్రజలు కచ్చితంగా అవగాహన కలిగి ఉండాలని, చెత్తను నాలుగు రకాలుగా వేరు చేయాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్వహణపై అవగాహన పొందాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు . ప్రతి గ్రామంలో గ్రామస్థులను సెగ్రిగేషన్ షెడ్లకు తీసుకు వెళ్లాలని సూచించారు. నీటి ట్యాంకులను నెలకు మూడు సార్లు బ్లీచింగ్ తో సిబ్బంది శుభ్రం చేయాలని అన్నారు .ఆయిల్ పామ్, సన్న వడ్లు, కూరగాయలు, పప్పు ధాన్యాలు తదితర లాభదాయక పంటలను సాగు చేయడానికి రైతులు ముందుకు రావాలని సూచించారు. ఆయిల్ పామ్ కు సంబంధించి సిద్దిపేట జిల్లా నర్మెట లో పరిశ్రమ ఉందని, పండించిన దిగుబడిని పరిశ్రమకు తీసుకువెళ్లడానికి దూర భారం కూడా లేదని అన్నారు . పంట మార్పిడి చేయకపోతే నేల సారం తగ్గుతుందనే విషయాన్ని రైతులు గమనించాలని పేర్కొన్నారు.

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ఇంటింటికీ వచ్చి వివరాలు సేకరించే బీఎల్ఓలకు ప్రజలు సహకరించాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఈ నెల 25 వ తేదీ నుంచి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యమన్నారు. బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు పంపించాలని కోరారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు.గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో యువతకు మార్కెట్ లో డిమాండ్ ఉన్న కోర్సులలో ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇస్తున్నారని, 18 నుంచి 35 ఏండ్ల లోపు వారు పూర్తి వివరాల కోసం గ్రామ పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. యువత శిక్షణను సద్వినియోగం చేసుకొని.. ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు.పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వామ్యులు కావాలని పిలుపు నిచ్చారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటాలని ఆదేశించారు. అటవీ శాఖ అధికారులు మొక్కలు నాటుతూ.. సంరక్షణకు చర్యలు తీసుకోవాలని అన్నారు గ్రామస్థులందరికీ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. మానాల గ్రామస్థులంతా ప్రభుత్వ బడికి కే పిల్లలను పంపిస్తామని తీర్మానించడంపై అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి చేస్తానని, ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని, ప్రవేశాలు పెరగాలని పేర్కొన్నారు.మానాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని, మొక్కలు నాటాలని.. పచ్చదనం పెంచాలని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా లో ఇబ్బందులు దూరం చేయాలని, భూ సమస్యలు పరిష్కరించాలని, అభివృద్ధి పనుల కోసం స్థానిక వనరుల నుంచి ఇసుక తీసుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. స్థానిక తాగునీటి సమస్య పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ చేస్తున్న కృషిని అభినందించారు. మారుమూల గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సభ నిర్వహణ పై హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసాచారి, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి షరీఫుద్దీన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవన శాఖ అధికారి శరత్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి సంగీత, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీఓ నటరాజ్, వివిధ గ్రామాల సర్పంచులు, మిషన్ భగీరథ, పోలీస్, విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**రెసిడెన్షియల్ విద్యాలయం పనుల్లో వేగం పెంచాలి**

రుద్రంగి మండలం గైదిగుట్ట తండాలో ట్రైబల్ వెల్ఫేర్ అప్ గ్రేడెడ్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ (గర్ల్స్) విద్యాలయం భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.రుద్రంగి మండలం గైదిగుట్ట తండా ట్రైబల్ వెల్ఫేర్ అప్ గ్రేడెడ్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ (గర్ల్స్) భవన నిర్మాణ పనులు కొనసాగుతుండగా, బుధవారం జిల్లా కలెక్టర్ తరగతి గదులు, హాస్టల్ భవనం, ఇతర నిర్మాణ పనులను పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యాలయం ఆవరణలో జిల్లా కలెక్టర్, అధికారులు మొక్కలు నాటారు.

# సాలిడ్ వ్యర్థాల నిర్వహణపై అవగాహన ఉండాలి




**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

సాలిడ్ వ్యర్థాల నిర్వహణపై అవగాహన ఉండాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలి కింద 99 రోజుల కార్యాచరణలో భాగంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సిరిసిల్ల మున్సిపాలిటీ డీఆర్సీ (డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్) కేంద్రంలో సాలిడ్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలు --2026 అమలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కార్యక్రమంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి నోడల్ అధికారి నూతన సాలిడ్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలను వివరించారు. అనంతరం డీఆర్సీ కేంద్రంలో జరుగుతున్న వ్యర్థాల నిర్వహణ ప్రక్రియలను అధికారులకు ప్రత్యక్షంగా చూపిస్తూ క్షేత్రస్థాయి అవగాహన కల్పించారు.

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వ్యర్థాల నిర్వహణలో భాగస్వామయ్యే అన్ని శాఖల అధికారులు కంపోస్ట్ షెడ్లను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, తడి వ్యర్థాలు, పొడి వ్యర్థాలు, శానిటరీ వ్యర్థాలు, ప్రత్యేక సంరక్షణ వ్యర్థాలు అనే నాలుగు విభాగాలుగా వ్యర్థాల వేరు చేయడాన్ని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. అలాగే బల్క్ వ్యర్థాల ఉత్పత్తిదారులను గుర్తించి నిబంధనల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.నూతన సాలిడ్ వ్యర్థాల నిర్వహణ నిబంధనల అమలులో నిర్లక్ష్యం లేదా ఉల్లంఘనలకు సంబంధించి సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే చట్టపరమైన చర్యలు కూడా తీసుకోవాలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి షర్ఫుద్దీన్, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ శ్రావణ్, స్వచ్ఛ భారత్ మిషన్ ఐఈసీ కన్సల్టెంట్, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల వార్డు అధికారులు, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు నియంత్రణ చట్టంపై మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం

**-బీఆర్ఎస్వీ నేత కంచర్ల రవి గౌడ్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**




ఎన్నికల సమయంలో ఫీజు నియంత్రణ చట్టం తీసుకొస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ అన్నారు . మంగళవారం సిరిసిల్ల పట్టణంలో ని తెలంగాణ భవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో రవి గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు యథేచ్ఛగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు ఉపశమనం కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు వారి సమస్యలను పూర్తిగా విస్మరించిందని అన్నారు .

ఫీజు నియంత్రణ చట్టాన్ని వెంటనే అమలు చేసి విద్యా సంస్థల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. విద్యను వ్యాపారంగా మార్చి అధిక ఫీజులు వసూలు చేస్తున్న సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు . విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీని నిలబెట్టుకుని ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మట్ట శ్రీనివాస్ .సదుల శేఖర్. బైకని వేణుగోపాల్ యాదవ్. బల్యాల ప్రవీణ్. ఎస్.కె జమీర్. అను మల్ల శివ. గౌడ అనిరుద్ తదితరులు పాల్గొన్నారు



## బదిలీపై వెళ్తున్న కేడీసీసీ ఉద్యోగులను సన్మానించిన వేములవాడ ప్యాక్స్ పాలకవర్గం..

**బలగం టీవీ, వేములవాడ :**

వేములవాడ కె డిసిసి బ్యాంక్ ఉద్యోగులు బదిలీపై వెళ్తుండగా వారిని బుధవారం ప్యాక్స్ చైర్మెన్ ఏనుగు తిరుపతిరెడ్డి ఘనంగా శాలువతో సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా ప్యాక్స్ చైర్మెన్ ఏనుగు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ వృత్తిలో బదిలీలు తప్పనిసరిగా ఉంటాయని, ఉద్యోగం చేసినచోట ఎంతో బాధ్యత రాహిత్యంతో ఉండి తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి బదిలీపై వెళ్తున్న వారిని సన్మానించడం చాలా ఆనందంగా ఉందన్నారు. బదిలీపై వెళ్తున్న బ్యాంకు స్టాఫ్ అరుణ్ కుమార్, ఝాన్సీ, శ్రీకాంత్ లకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్లు రాజయ్య, సంజీవరెడ్డి, కొండ శేఖర్, అమృత, సీఈఓ లక్ష్మణ్, మాజీ డైరెక్టర్లు గుడిసె సదానందం, రాచర్ల మహేందర్, కేడీసీసీ బ్యాంకు మేనేజర్ విజయ్ పవన్, ఉద్యోగులు సతీష్, శ్వేత, లావణ్య, అంజలి, విమల, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రీమియం లీగ్ క్రికెట్ కు ఎంపికైన యువ క్రీడాకారుడు

**అడ్వకేట్ కుంట శ్రీనివాస్ తనయుడు కుంట రాహుల్**

**బలగం టివి, ఎల్లారెడ్డిపేట**




తెలంగాణ ప్రీమియం లీగ్ టి20 క్రికెట్ పోటీలకు రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన యువ క్రీడాకారుని మెదక్ ఫాల్కన్స్ జట్టు 75 వేలకు దక్కించుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామానికి చెందిన అడ్వకేట్ కుంట శ్రీనివాస్ – పద్మ దంపతులకు కుమారుడు కుంట రాహుల్ మెదక్ ఫాల్కన్స్ జట్టు కు ఎంపిక అయ్యాడు. టి జి పి ఎల్ వేలంలో రాష్ట్రవ్యాప్తంగా 6000 మంది క్రికెటర్లు పాల్గొనగా వారిలో 160 మందిని ఎనిమిది జట్లు ఎంపిక చేశాయి. కుంట రాహుల్ యువ క్రికెటర్ గా బౌలింగ్లో ప్రతిభ కనబరుస్తూ మెదక్ జట్టుకు ఎంపిక కావడం అభినందనీయమని రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు క్రికెట్ అభిమానులు రాహుల్ ను అభినందిస్తున్నారు. చిన్నతనం నుండే రాహుల్ క్రికెట్ పట్ల మక్కువ పెంచుకొని బౌలింగ్లో రాణిస్తూ అంచలంచలుగా ఎదిగాడు. భారత స్టార్ క్రికెటర్ తిలక్ వర్మ ఆడుతున్న మెదక్ ఫాల్కన్స్ జట్టులో ఆడడం ఆనందంగా ఉందని కుంట రాహుల్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని బండ లింగంపల్లి గ్రామానికి చెందిన యువ క్రికెటర్ కుంట రాహుల్ గొప్ప గొప్ప క్రీడాకారులతో సమానంగా మెదక్ ఫాల్కన్స్ జట్టుకు ఎంపిక కావడం అభినందనీయమని మాజీ జడ్పిటిసి సభ్యుడు చీటీ లక్ష్మణ్ రావు, బండ లింగంపల్లి సర్పంచ్ నర్సా గౌడ్, పలువురు జిల్లా ప్రజలు రాహుల్ ను అభినందిస్తున్నారు,

# టీ20 ప్రపంచకప్ సమరానికి సిద్ధమైన భారత్



- జూన్ 14న 'భారత్-పాక్' హైవోల్టేజ్ పోరు!
- చరిత్ర సృష్టించాలని హర్మన్‌ప్రీత్ సేన పట్టుదల
- గ్రూప్ 'ఏ' లో పటిష్టమైన ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు

**బలగం టీవీ, లండన్**

ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ 2026కు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. రేపటి నుంచి సమరం ప్రారంభం కానుంది. ఇక క్రికెట్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ మెగా టోర్నమెంట్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు జూన్ 14న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగే హైవోల్టేజ్ మ్యాచ్‌తో తమ ప్రస్థానాన్ని ప్రారంభించనుంది. బర్మింగ్‌హామ్‌లోని చారిత్రాత్మక ఎడ్జ్‌బాస్టన్ మైదానం ఈ సమరానికి వేదిక కానుంది. ఇప్పటివరకు పొట్టి ఫార్మాట్‌లో ప్రపంచకప్ అందుకోలేకపోయిన టీమిండియా, ఈసారి ఎలాగైనా కప్ గెలిచి చరిత్ర సృష్టించాలని పట్టుదలతో ఉంది.

**సవాల్‌గా మారిన సెమీస్ రేసు:**

ఈ మెగా టోర్నీలో భారత జట్టు గ్రూప్ 'ఎ' లో ఉంది. ఇందులో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాతో పాటు పాకిస్థాన్, నెదర్లాండ్స్, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్ వంటి బలమైన జట్లు ఉన్నాయి. ఇటీవలే ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా గడ్డపై సిరీస్ విజయాలతో భారత్ సత్తా చాటినప్పటికీ.. టోర్నీకి ముందు దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్‌లతో జరిగిన సిరీస్‌లలో ఓటమి పాలవ్వడం జట్టు సన్నద్ధతపై ఆందోళన కలిగిస్తోంది. దీనికి తోడు కొంతమంది కీలక ఆటగాళ్ల ఫామ్‌లేమి, ఆల్‌రౌండర్ల గాయాలు సెమీస్ చేరే అవకాశాలకు సవాల్‌గా మారాయి. జూన్ 21న దక్షిణాఫ్రికాతో జరిగే మ్యాచ్ భారత్ సెమీస్ భవితవ్యాన్ని తేల్చనుంది.

**జట్టులో 'ఎక్స్ ఫ్యాక్టర్' శ్రీ చరణి:**

భారత తుది జట్టు (ప్లేయింగ్ ఎలెవన్)లో ఓపెనర్లుగా షెఫాలీ వర్మ, స్మృతి మంధాన బరిలోకి దిగనుండగా.. మిడిల్ ఆర్డర్‌లో జెమీమా రోడ్రిగ్స్ బాధ్యత తీసుకోనుంది. ఇంగ్లాండ్ పిచ్‌లపై 130.25 స్ట్రైక్ రేట్‌తో ఆడిన అనుభవం జెమీమాకు ఉంది. అలాగే 21 ఏళ్ల యువ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ శ్రీ చరణి బౌలింగ్‌లో జట్టుకు 'ఎక్స్ ఫ్యాక్టర్'గా మారే అవకాశం ఉంది. అయితే, వికెట్ కీపర్ రిచా ఘోష్ ఫామ్‌లేమి, యాస్తిక భాటియా నెమ్మదైన బ్యాటింగ్ మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతోంది.

ఈ టోర్నీలో భారత స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన తన అంతర్జాతీయ టీ20 కెరీర్‌లో 4500 పరుగుల మైలురాయిని అందుకోవడానికి మరో 167 పరుగుల దూరంలో ఉన్నారు. అలాగే పేసర్ అరుంధతి రెడ్డి తన 50 అంతర్జాతీయ టీ20 వికెట్ల మైలురాయిని చేరడానికి కేవలం రెండు వికెట్ల దూరంలో నిలిచారు.

**భారత లీగ్ మ్యాచ్‌ల షెడ్యూల్ (భారత కాలమానం ప్రకారం రాత్రి 7:00 గంటలకు):**

జూన్ 14: భారత్ వర్సెస్ పాకిస్థాన్ (బర్మింగ్‌హామ్)
జూన్ 17: భారత్ వర్సెస్ నెదర్లాండ్స్ (లీడ్స్)
జూన్ 21: భారత్ వర్సెస్ సౌతాఫ్రికా (మాంచెస్టర్)
జూన్ 25: భారత్ వర్సెస్ బంగ్లాదేశ్ (మాంచెస్టర్)
జూన్ 28: భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా (లండన్)



# 9 ఏళ్ల తర్వాత లంక గడ్డపై అడుగుపెట్టనున్న టీమిండియా..

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత క్రికెట్ అభిమానులకు ఒక అదిరిపోయే గుడ్ న్యూస్ అందింది. టీమిండియా సుదీర్ఘ విరామం తర్వాత పొరుగు దేశమైన శ్రీలంకలో టెస్ట్ సిరీస్ ఆడేందుకు సిద్ధమవుతోంది. దాదాపు 9 సంవత్సరాల తర్వాత భారత జట్టు లంక గడ్డపై వైట్ జెర్సీతో బరిలోకి దిగబోతుండటం విశేషం. చివరిసారిగా 2017లో విరాట్ కోహ్లీ సారథ్యంలో భారత జట్టు శ్రీలంకలో టెస్ట్ సిరీస్ ఆడింది. అప్పట్లో లంకను వారి సొంత గడ్డపైనే క్లీన్ స్వీప్ చేసి కోహ్లీ సేన చరిత్ర సృష్టించింది. మళ్లీ ఇన్నాళ్ల తర్వాత టీమిండియా అక్కడ అడుగుపెడుతుండటంతో ఈ టూర్ ఫుల్ ఇంట్రెస్టింగ్‌గా మారింది.ప్రముఖ క్రీడా వెబ్‌సైట్ క్రిక్‌బజ్ నివేదిక ప్రకారం.. భారత్, శ్రీలంక మధ్య రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆగస్టు 15న ఘనంగా ప్రారంభం కానుంది. సరిగ్గా భారతదేశ స్వాతంత్ర్య దినోత్సవం రోజున గాల్ అంతర్జాతీయ స్టేడియం వేదికగా మొదటి టెస్ట్ మ్యాచ్ మొదలవుతుంది. ఈ మ్యాచ్ ఆగస్టు 15 నుంచి 19 వరకు జరుగుతుంది. ఆ తర్వాత కొద్దిరోజుల గ్యాప్‌తో ఆగస్టు 23 నుంచి రెండో టెస్ట్ మ్యాచ్ ప్రారంభం కానుంది. అయితే, ఈ రెండో మ్యాచ్ జరగబోయే వేదికపై లంక బోర్డు ఇంకా అధికారిక ప్రకటన చేయనప్పటికీ, సెంట్రల్ కొలంబోలోని ప్రసిద్ధ సింహాలీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో నిర్వహించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.శ్రీలంకతో జరగబోయే ఈ రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కేవలం ద్వైపాక్షిక సిరీస్ మాత్రమే కాదు. ఇది ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో భాగంగా జరగబోతోంది. కాబట్టి ఫైనల్ రేసులో నిలవాలంటే రెండు జట్లకూ ఈ సిరీస్ అత్యంత కీలకం కానుంది. ఇప్పటివరకు శ్రీలంక క్రికెట్ బోర్డు కానీ, భారత క్రికెట్ నియంత్రణ మండలి కానీ ఈ షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటించలేదు. కానీ అంతర్గత సమాచారం ప్రకారం ఈ తేదీలు దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సారథ్యంలో భారత్ ఈ సిరీస్ ఆడబోతుండటం గమనార్హం. ఈ పర్యటనలో కేవలం టెస్ట్ మ్యాచ్‌లు మాత్రమే కాకుండా, అభిమానులను అలరించడానికి మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కూడా ఉండే అవకాశం ఉందని సమాచారం. ఈ విషయాన్ని బీసీసీఐ సెక్రటరీ దేవాజిత్ సైకియా కూడా హింట్ ఇచ్చారు. లంక బోర్డు నుంచి అదనంగా మూడు టీ20 మ్యాచ్‌లు ఆడాల్సిందిగా తమకు అభ్యర్థన వచ్చిందని ఆయన మీడియాకు వెల్లడించారు. దీనిపై బీసీసీఐ సానుకూలంగానే ఉందని, త్వరలోనే మ్యాచ్‌ల తేదీలు, వేదికలతో కూడిన పూర్తి అధికారిక షెడ్యూల్‌ను ఇరు దేశాల బోర్డులు సంయుక్తంగా విడుదల చేస్తాయని ఆయన స్పష్టం చేశారు.

# పసికూన చేతిలో ఘోరంగా ఓడిన పాకిస్తాన్..

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ఐసీసీ ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్–2026 ప్రధాన టోర్నమెంట్ ప్రారంభానికి ముందే పాకిస్తాన్ మహిళల జట్టుకు వరుస పరాజయాలు ఎదురవుతున్నాయి. మంగళవారం డెర్బీలోని కౌంటీ గ్రౌండ్‌లో స్కాట్లాండ్‌తో జరిగిన తన రెండవ, చివరి వార్మప్ మ్యాచ్‌లో పాకిస్తాన్ 41 పరుగుల తేడాతో (డీఎల్ఎస్ పద్ధతి ప్రకారం) పరాజయం పాలైంది. వర్షం కారణంగా నిలిచిపోయిన ఈ మ్యాచ్‌లో స్కాట్లాండ్ అద్భుత ప్రదర్శనతో పాక్‌ను చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన పాకిస్తాన్ మొదట స్కాట్లాండ్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. స్కాట్లాండ్ ఓపెనర్ డార్సీ కార్టర్ (36 బంతుల్లో 45 పరుగులు) జట్టుకు బలమైన ఇన్నింగ్స్ అందించింది. ఆమె మరో ఓపెనర్ కేథరిన్ ఫ్రేజర్ (19)తో కలిసి మొదటి వికెట్‌కు 6 ఓవర్లలోనే 41 పరుగులు జోడించింది.

ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన స్కాట్లాండ్ కెప్టెన్ కేథరిన్ బ్రైస్ మైదానంలో పరుగుల విధ్వంసం సృష్టించింది. కేవలం 43 బంతుల్లోనే 11 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 94 పరుగులు చేసి తృప్తిగా సెంచరీ చేజార్చుకుంది. ఆమె మెరుపు ఇన్నింగ్స్ కారణంగా స్కాట్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 191 పరుగుల భారీ స్కోరు సాధించింది. పాక్ బౌలర్లు క్రమంగా వికెట్లు తీసినప్పటికీ, ఫీల్డర్ల పేలవమైన ప్రదర్శన కారణంగా బ్రైస్‌ను అడ్డుకోలేకపోయారు. ఇన్నింగ్స్ చివరి బంతికి ఆమె రనౌట్ అయింది. 192 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్తాన్ మహిళల జట్టు ఆరంభంలోనే చేతులెత్తేసింది. మొదటి ఐదు ఓవర్లలోనే గుల్ ఫెరోజా, సైరా జబీన్, ఆయేషా జాఫర్ వంటి కీలక వికెట్లను కోల్పోయి తీవ్ర ఒత్తిడిలో పడింది. స్కాట్లాండ్ బౌలర్ రాచెల్ స్లేటర్ తన రెండు ఓవర్లలోనే రెండు వికెట్లు తీసి పాక్‌ను కోలుకోలేని దెబ్బతీసింది. 9 ఓవర్లు ముగిసేసరికి పాకిస్తాన్ 62 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది.ఈ దశలో హఠాత్తుగా కురిసిన వర్షం కారణంగా మ్యాచ్ నిలిచిపోయింది. ఎంతకీ వర్షం తగ్గకపోవడంతో అంపైర్లు ఆటను రద్దు చేసి, డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం స్కాట్లాండ్‌ను 41 పరుగుల తేడాతో విజేతగా ప్రకటించారు.తమ మొదటి వార్మప్ మ్యాచ్‌లో శ్రీలంక చేతిలో 9 వికెట్ల తేడాతో ఓడిపోయిన పాకిస్తాన్‌కు, ఇది వరుసగా రెండవ పరాజయం. ఈ



ఆదివారం (జూన్ 14న) ఎడ్జ్‌బాస్టన్ వేదికగా సాంప్రదాయ ప్రత్యర్థి భారత్‌తో జరగబోయే తమ తొలి ప్రపంచకప్ గ్రూప్ మ్యాచ్‌కు ముందు ఈ వరుస ఓటములు పాక్ జట్టు ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీశాయి. మరోవైపు, ఉత్సాహంలో ఉన్న స్కాట్లాండ్ జట్టు జూన్ 13న ఓల్డ్ ట్రాఫోర్డ్ వేదికగా ఐర్లాండ్‌తో తలపడనుంది. ఈ ప్రపంచకప్ టోర్నీలో గ్రూప్–ఎ లో భారత్, పాకిస్తాన్‌లతో పాటు ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్ జట్లు ఉన్నాయి. గ్రూప్–బి లో ఆతిథ్య ఇంగ్లాండ్, డిఫెండింగ్ ఛాంపియన్ న్యూజీలాండ్, వెస్టిండీస్, శ్రీలంక, స్కాట్లాండ్, ఐర్లాండ్ జట్లు ఉన్నాయి. కాగా, ఈ మెగా టోర్నమెంట్ శుక్రవారం బర్మింగ్‌హామ్‌లో ఇంగ్లాండ్–శ్రీలంక మ్యాచ్‌తో అధికారికంగా ప్రారంభం కానుంది.



# వైభవ్ సూర్యవంశీ అద్భుతమైన ప్రతిభావంతుడు

## సౌతాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్. ప్రశంసలు

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత క్రికెట్ రంగంలో సరికొత్త సంచలనం 15 ఏళ్ల యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ ప్రస్తుతం క్రీడా ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారాడు. ఐపీఎల్ సీజన్ లో దాదాపు 800 పరుగులు సాధించి, టోర్నమెంట్ చరిత్రలోనే అత్యంత పిన్న వయసులో 'ఆరెంజ్ క్యాప్' గెలుచుకున్న ఆటగాడిగా వైభవ్ రికార్డు సృష్టించాడు. అతని అసాధారణ ప్రదర్శన చూసిన సెలక్టర్లు.. ఏరికోరి అతడిని భారత జాతీయ జట్టుకు ఎంపిక చేశారు. దీని ద్వారా పురుషుల అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలోనే టీమిండియా పిలుపు అందుకున్న అత్యంత పిన్న వయస్కుడిగా వైభవ్ సూర్యవంశీ చరిత్ర పుటల్లోకెక్కాడు. కేవలం ఐపీఎల్ మాత్రమే కాదు.. వైభవ్ సూర్యవంశీ వయసు విభాగాల క్రికెట్ లో, దేశీవాళీ (డొమెస్టిక్) సర్క్యూట్ లో, జూనియర్ అంతర్జాతీయ క్రికెట్ లోనూ రికార్డు బద్దలు కొట్టే ప్రదర్శనలతో ఆకట్టుకున్నాడు. ఇటీవల భారత్ సాధించిన అండర్–19 ప్రపంచకప్ విజయంలోనూ అతను కీలక పాత్ర పోషించాడు. పరిమిత ఓవర్ల (లిమిటెడ్ ఓవర్స్) క్రికెట్ లో తన అపారమైన ప్రతిభను ఇప్పటికే నిరూపించుకున్న ఈ యువ సంచలనం.. భవిష్యత్తులో రెడ్–బాల్ (టెస్ట్) క్రికెట్ లో కూడా ఇదే రీతిన రాణించగలడా? అసలు అతనికి టెస్ట్ క్రికెట్ ఆడాలనే ఆసక్తి ఉందా? అనే ప్రశ్నలు ఇప్పుడు వ్యక్తమవుతున్నాయి. అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో అన్ని ఫార్మాట్లలో అత్యుత్తమ బ్యాటర్‌గా పేరొందిన సౌతాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్.. వైభవ్ సూర్యవంశీని "అద్భుతమైన ప్రతిభావంతుడు" అని కొనియాడారు. అయితే అతను టెస్ట్ క్రికెట్ వైపు అడుగులు వేస్తాడా లేదా అనేదానిపై ఆదివారం ఒక ఇంటర్వ్యూలో డివిలియర్స్ తన అభిప్రాయాలను పంచుకున్నారు."అవును, అతను అద్భుతమైన టాలెంట్. కానీ రెడ్–బాల్ క్రికెట్ గురించి నేను కచ్చితంగా సమాధానం చెప్పలేను. అతను అనుకుంటే టెస్ట్ క్రికెట్ ఆడగలడు, కానీ ఇక్కడే పెద్ద ప్రశ్న వస్తుంది.. అతనికి నిజంగానే టెస్ట్ క్రికెట్ ఆడాలని ఉందా? దానికి కాలమే సమాధానం చెబుతుంది. అతనికి ఆ సామర్థ్యం, ప్రతిభ ఉన్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే టెస్ట్ క్రికెట్ అంత సులువు కాదు, కొన్ని సవాళ్లు ఎదురవుతాయి. నా అభిప్రాయం ప్రకారం అతను టెస్ట్ క్రికెట్ ఆడాలని నేను కోరుకుంటున్నాను, కానీ ఆడతాడా అనేది అనుమానమే. భవిష్యత్తులో ఏం జరుగుతుందో చూద్దాం" అని డివిలియర్స్ వ్యాఖ్యానించారు. ఇంత చిన్న వయసులోనే వైభవ్‌కు భారత జట్టులో చోటు కల్పించాలనే సెలక్టర్ల నిర్ణయాన్ని డివిలియర్స్ పూర్తిగా సమర్థించారు. "సెలక్టర్లు ఖచ్చితంగా సరైన నిర్ణయం తీసుకున్నారు. ఇంతటి ధైర్యమైన నిర్ణయం తీసుకున్నందుకు వారికి అభినందనలు. అతను ఇంకా చాలా చిన్నవాడని, అనుభవం లేదని పక్కన పెట్టడం చాలా సులువు. కానీ వైభవ్ తన ప్రతిభతో ఆ తలుపులు బద్దలు కొట్టాడు. భారత టీ20 జట్టులో స్థానానికి అతను పూర్తి అర్హుడు. అతని పట్ల నేను చాలా సంతోషంగా ఉన్నాను" అని ఏబీ డివిలియర్స్ పేర్కొన్నారు.

# బంగ్లాదేశ్ చేతిలో ఆస్ట్రేలియాకు ఘోర పరాజయం



## తొలి వన్డేలో 86 రన్స్ తేడాతో బంగ్లాదేశ్ విక్టరీ

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ఢాకా వేదికగా జరిగిన తొలి వన్డేలో ప్రపంచ ఛాంపియన్ ఆస్ట్రేలియాకు బంగ్లాదేశ్ షాక్ ఇచ్చింది. మొసద్దిక్ హెసైన్ (86) రాణించడంతో మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 284 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో ఆసీస్ 191/9 వద్ద ఉన్నప్పుడు వర్షం పడటంతో, డీఎల్ఎస్ పద్ధతి ప్రకారం బంగ్లాదేశ్ 86 పరుగుల తేడాతో గెలిచింది. నహిద్ రాణా 4 వికెట్లు తీశాడు. కాగా, వన్డేల్లో ఆసీస్‌పై బంగ్లాదేశ్‌కు 21 ఏళ్ల తర్వాత (చివరిగా 2005లో) ఇదే తొలి విజయం. వన్డే ప్రపంచ ఛాంపియన్ ఆస్ట్రేలియాకు భారీ షాక్ తగిలింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా మంగళవారం ఢాకా వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచులో చిత్తుగా ఓడిపోయింది. ప్రపంచ ఛాంపియన్ అయిన ఆసీస్.. చిన్న జట్టు బంగ్లాదేశ్ చేతిలో పరాజయం చవిచూసింది. 21 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత బంగ్లాదేశ్.. ఆస్ట్రేలియాను వన్డేల్లో ఓడించింది. ఆల్ రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన బంగ్లాదేశ్.. మూడు వన్డేల సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది.3 వన్డేలు, 3 టీ20 మ్యాచులు ఆడేందుకు ఆస్ట్రేలియా జట్టు బంగ్లాదేశ్ గడ్డపై అడుగుపెట్టింది. ఇందులో భాగంగా తొలి మ్యాచ్ బంగళవారం ఢాకాలో జరిగింది. ఈ మ్యాచులో టాస్ గెలిచిన ఆస్ట్రేలియా కెప్టెన్ జోష్ ఇంగ్లిస్.. తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ భారీ స్కోరు చేసింది. నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 284 పరుగులు స్కోరు చేసింది. మొసద్దిక్ హెసైన్ 70 బంతుల్లో 86 రన్స్ చేశాడు. ఛేజింగ్ ప్రారంభించిన ఆస్ట్రేలియాకు తొలి బంతికే షాక్ తగిలింది. ఓపెనింగ్ బ్యాటర్ మాథ్యూ షార్ట్ తాను ఎదుర్కొన్న తొలి బంతికే ఔట్ అయ్యాడు. ఆ తర్వాతి ఓవర్లోనే మార్నస్ లబుషేన్ (1) కూడా వెనుదిరిగాడు. కూపర్ కన్నోలీ (35), జోష్ ఇంగ్లిస్ (19) కూడా భారీ స్కోరు చేయలేకపోయారు. 47 రన్స్ చేశాక అలెక్స్ కేరీ కూడా ఔట్ కావడంతో ఆస్ట్రేలియా ఓటమి దాదాపుగా ఖరారైపోయింది. అయితే జట్టు స్కోరు 42.2 ఓవర్లలో 191/9 వద్ద ఉండగా.. వర్షం అంతరాయం కలిగించింది. ఎంతకూ వాన తగ్గకపోవడంతో డక్ వర్త్ లూయిస్ ప్రకారం బంగ్లాదేశ్.. 86 పరుగుల తేడాతో విజయం సాధించినట్లు అంపైర్లు ప్రకటించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో నహిద్ రాణా.. 4 వికెట్లతో సత్తాచాటాడు. ముస్తాఫిజుర్ రెహ్మాన్ 2, మొసద్దిక్ హోస్సెన్ 2, తస్కిన్ అహ్మద్ 1 వికెట్ తీశారు. కాగా బంగ్లాదేశ్ చేతిలో ఆస్ట్రేలియా 21 ఏళ్ల తర్వాత వన్డే మ్యాచులో ఓడిపోయింది. బంగ్లాదేశ్ 2005లో రికీ పాంటింగ్ సారథ్యంలోని ఆసీస్‌ను ఓడించింది.




# మైదానంలో తీవ్ర వాగ్వాదం

## ఇంగ్లిస్‌ను రెచ్చగొట్టిన నహిద్ రాణా

**బలగం టీవీ, హైదరాబాద్**

ఢాకా వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో బంగ్లాదేశ్ పేసర్ నహిద్ రాణా, ఆసీస్ కెప్టెన్ జోష్ ఇంగ్లిస్ మధ్య మైదానంలో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఆసీస్ ఇన్నింగ్స్ 11వ ఓవర్లో ఇంగ్లిస్ (19) వికెట్ తీసిన రాణా, అతని ముందే రెచ్చగొట్టేలా సెలబ్రేషన్స్ చేసుకున్నాడు. అదే సమయంలో ఏదో అనడంతో ఇంగ్లిస్ తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. పెవిలియన్‌కు వెళ్తూ వెనక్కి తిరిగి గొడవకు దిగిన ఇంగ్లిస్‌ను బంగ్లాదేశ్ ఆటగాళ్లు సముదాయించి పంపించారు.బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా మధ్య ఢాకా వేదికగా జరిగిన తొలి వన్డేలో ఓ ఆసక్తికర ఘటన జరిగింది. ఈ మ్యాచులో బంగ్లాదేశ్ పేసర్ నహిద్ రాణా , ఆస్ట్రేలియా కెప్టెన్ జోష్ ఇంగ్లిస్ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. రెండో ఇన్నింగ్స్‌లో జోష్ ఇంగ్లిస్ ఔట్ అయిన తర్వాత వివాదం చెలరేగింది. నహిద్ రాణా సెలబ్రేషన్స్ ఇంగ్లిస్‌కు కోపం తెప్పించాయి. దీంతో మైదానంలో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చివరకు బంగ్లాదేశ్ ప్లేయర్లు సముదాయించడంతో వివాదం సద్దు మణిగింది.ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్.. 284/8 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన ఆస్ట్రేలియా తొలి 8 బంతుల్లోనే రెండు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ సమయంలో కెప్టెన్ జోష్ ఇంగ్లిస్.. ఆదుకునే ప్రయత్నం చేశాడు. దీంతో 10 ఓవర్లు ముగిసే సరికి ఆసీస్.. 51/2తో నిలిచింది. అప్పటికే ఇంగ్లిస్ 19 రన్స్ చేశాడు. అయితే 11వ ఓవర్ వేసేందుకు నహిద్ రాణా వచ్చాడు. స్ట్రైకింగ్‌లో ఇంగ్లిస్ ఉన్నాడు. రాణా వేసిన బంతిని షాట్ ఆడబోయిన ఇంగ్లిస్.. వికెట్ కీపర్ చేతికి చిక్కాడు. బ్యాట్ బంతిని తాకుతూ వెళ్లి వికెట్ కీపర్ చేతిలో పడటంతో ఔట్ అయ్యాడు. దీంతో నహిద్.. సెలబ్రేట్ చేసుకున్నాడు. ఇంగ్లిస్ ముందే తనదైన శైలిలో సంబురాలు చేసుకున్నాడు. ఆ తర్వాత నహిద్.. ఏదో అనగా ఇంగ్లిస్ కోపోద్రిక్తుడైపోయాడు. పెవిలియన్‌కు వెళ్లిపోతున్న అతడు.. వెనక్కి తిరిగి గొడవకు దిగాడు. కానీ అక్కడే ఉన్న బంగ్లాదేశ్ ప్లేయర్లు.. జోక్యం చేసుకోవడంతో వివాదం సద్దుమణిగింది. ఇంగ్లిస్ పెవిలియన్‌కు వెళ్లిపోయాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ మ్యాచులో ఆస్ట్రేలియా 86 పరుగుల(డక్ వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం) తేడాతో పరాజయం పాలైంది. దీంతో బంగ్లాదేశ్ చేతిలో 21 ఏళ్ల తర్వాత వన్డే మ్యాచులో ఓడిపోయింది. 2005లో రికీ పాంటింగ్ సారథ్యంలోని ఆస్ట్రేలియా జట్టు సైతం బంగ్లాదేశ్ చేతిలో ఓడిపోయింది.

# గంభీర్‌ను బైపాస్ చేసిన ఆటగాళ్లు..!

వచ్చే ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్? కోసం టీమ్?ఇండియా ఇప్పటి నుంచే సన్నాహాలు చేస్తోంది. భారత్?– అఫ్గానిస్థాన్? వన్డే సిరీస్?తోనే ఈ సన్నాహాలు ప్రారంభం కానున్నాయి. అయితే ఈ లోపే భారత్ జట్టులో సర్దుబాటు చేయాల్సిన సమస్యలు చాలానే ఉన్నాయని విశ్లేషకులు అంటున్నారు. ముఖ్యంగా సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల భవిష్యత్?పై చర్చలు జోరుగా నడుస్తున్నాయి. వాళ్లు వచ్చే వన్డే ప్రపంచ కప్? వరకు ఉంటారా? లేదా? అనేది ఇప్పుడు హాట్ టాపిక్?గా మారింది. టెస్టులు, టీ20 ఫార్మాట్లలో అత్యంత పట్టున్న వ్యూహకర్తగా గౌతమ్? గంభీర్? పేరుతెచ్చుకున్నాడు. కానీ వన్డే క్రికెట్?కు సంబంధించి ఆ స్థాయి పట్టు అతడు సంపాదించలేకపోయాడని టాక్. ముఖ్యంగా వన్డే టీమ్?లోని రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లాంటి సీనియర్ ఆటగాళ్లతో గంభీర్?కు సరైన సమన్వయం లేదని సమాచారం. ఈ నేపథ్యంలోనే జట్టులోని ఈ ఇద్దరు సీనియర్ ఆటగాళ్లు గంభీర్?ను పక్కన పెట్టి (బైపాస్ చేసి) 2027 వన్డే ప్రపంచకప్? నాటికి తమ భవిష్యత్తు ఎలా ఉంటుందనే విషయంపై స్పష్టత కోసం నేరుగా భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) పెద్దలను ఆశ్రయించినట్లు సమాచారం.రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టీ20ల నుంచి రిటైర్? అయినప్పటి నుంచి, వాళ్లిద్దరూ 2027 వన్డే ప్రపంచకప్?లో ఆడతారా? లేదా? వారి భవిష్యత్ ప్లాన్స్? ఏంటి అనే అంశాలు తెరపైకి వచ్చాయి. అయితే గౌతమ్ గంభీర్ అనుసరిస్తున్న విధానాలు, అలాగే సెలక్షన్ కమిటీ డిమాండ్లు ఈ ఇద్దరు సీనియర్ ఆటగాళ్లపై ప్రభావం చూపే అవకాశం ఉందని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. కాగా, రాయల్? ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్?సీబీ) తరఫున ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్?) 2026 సీజన్? ఆడిన విరాట్? కోహ్లీ ఒక విషయాన్ని స్పష్టం చేశాడు. తాను మంచి క్రికెటర్ అని మళ్లీ నిరూపించుకోవాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పాడు. ఇక రోహిత్ శర్మ ఛాంపియన్స్ ట్రోఫీ విజయంలో కీలకపాత్ర పోషించాడు. అతడు ఇప్పుడు వన్డే వరల్డ్ కప్? విషయంలో భిన్నమైన విధానాన్ని అనుసరిస్తున్నట్లు తెలుస్తోంది. ఓ ప్రముఖ వార్తాపత్రిక నివేదిక ప్రకారం, గౌతమ్ గంభీర్? నేతృత్వంలోని టీం మేనేజ్?మెంట్?కు, కొందరు సీనియర్ ఆటగాళ్లకు మధ్య పూర్తిస్థాయి అవగాహన కుదరలేదు. ప్రస్తుతానికి ఆ సీనియర్ ఆటగాళ్లు తమ భవిష్యత్తుపై నేరుగా బీసీసీఐ పెద్దలతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ పరిణామం అటు కోచ్? గంభీర్?ను, ఇటు సెలక్షన్ కమిటీ ఛైర్మన్? అజిత్ అగార్కర్?ను ఇరకాటంలో పడేసింది. "జట్టులో విరాట్?, రోహిత్ లాంటి అనుభవజ్ఞులైన ఆటగాళ్లు ఉన్నప్పుడు, డ్రెస్సింగ్ రూమ్?లో కెప్టెన్? శుభ్?మన్? గిల్?కు మరింత బలమైన పట్టు ఉండాలి. అయితే టెస్ట్, టీ20 ఫార్మాట్లలో చూపించినంత శ్రద్ధ గంభీర్ వన్డేలపై చూపించడం లేదు. ఇప్పటి వరకు ఆయన వన్డే మ్యాచులు, సిరీస్?ల్లో ఏం జరిగినా వాటి



మానాన వాటిని సాగిపోనిచ్చారు" అని బీసీసీఐకు చెందిన ఒక అధికారి తెలిపారు. "ఇప్పుడు దృష్టి అంతా వన్డే ప్రపంచకప్ సన్నాహాలపైకి మళ్లింది. అందుకే గంభీర్?, గిల్? బాధ్యతలు తీసుకొని, తమ ఆలోచనలను డ్రెస్సింగ్ రూమ్?లో స్పష్టంగా చెప్పే అవకాశం ఉంది. ఇన్నేళ్లుగా భారత్ జట్టుకు ఎనలేని సేవలు అందించిన సీనియర్ ఆటగాళ్ల నుంచి జట్టు ఇప్పుడు ఏం ఆశిస్తోందో సూటిగా చెప్పాలి. అలాగే రానున్న 16 నెలల ప్రణాళిక ఏంటి అనేది స్పష్టంగా వివరించాలి. ఇదే ముఖ్యం" అని సదరు బీసీసీఐ అధికారి తెలిపారు. "2026 నవంబర్ నాటికి విరాట్ కోహ్లీకి 38 ఏళ్లు నిండుతాయి. రోహిత్ శర్మ ఇప్పటికే 39 ఏళ్లకు చేరుకున్నాడు. ఈ నేపథ్యంలో వన్డే ప్రపంచకప్? జట్టులో వారు ఉంటారా? ఒక వేళ ఉంటే జట్టులో వారి స్థానం ఏమిటి అనే ప్రశ్నలు చెలరేగుతున్నాయి. ఈ పరిస్థితిని గంభీర్, గిల్? ఎలా సమన్వయం చేసుకుంటారనే దానిపై భారతదేశ ప్రపంచకప్ కలలు ఆధారపడి ఉంటాయి" అని సదరు బీసీసీఐ అధికారి పేర్కొన్నారు.




# దసరాకు షిఫ్ట్ అయిన టాక్సిక్ విడుదల

● చిత్ర వర్గాల్లో బలమైన టాక్

**బలగం టీవీ, హైదరాబాద్**

కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' గురించి మరోసారి ఆసక్తికర వార్తలు సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నాయి. కేజీఎఫ్ సిరీస్‌తో దేశవ్యాప్తంగా సంచలన క్రేజ్ సంపాదించుకున్న యష్ నుంచి వస్తున్న తదుపరి సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే సినిమా విడుదల తేదీ విషయంలో మాత్రం ఇంకా స్పష్టత రాకపోవడంతో అభిమానుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. ప్రతిభావంతురాలైన దర్శకురాలు గీతూ

మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో యష్ సరసన రుక్మిణి వసంత్, తారా సుతారియా నటిస్తుండగా, కీలక పాత్రల్లో హుమా ఖురేషి, కియారా అద్వానీ, నయనతార కనిపించనున్నారని సమాచారం. భారీ తారాగణం, హై బడ్జెట్ నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ సినిమా మొదటి నుంచే దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ చిత్రం ఇప్పటికే విడుదల కావాల్సి ఉన్నప్పటికీ, మేకర్స్ సరైన సమయాన్ని ఎంపిక చేసుకునే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది. మార్కెట్ పరిస్థితులు, ఇతర పెద్ద సినిమాల విడుదలలు, పాన్ ఇండియా స్థాయిలో బిజినెస్ అవకాశాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని విడుదలను వాయిదా వేస్తున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. తాజాగా సమాచారం ప్రకారం 'టాక్సిక్' సినిమా ఈ ఏడాది అక్టోబర్ నెలకు షిఫ్ట్ అయ్యే అవకాశాలు ఉన్నాయట. ముఖ్యంగా అక్టోబర్ తొలి వారం లేదా మూడో వారంలో విడుదల చేయాలని మేకర్స్ ఆలోచిస్తున్నట్లు కన్నడ సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, అభిమానులు అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటి వరకు చిత్ర బృందం నుంచి రిలీజ్ డేట్‌పై ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. దీంతో ఈ వార్తల్లో ఎంతవరకు నిజం ఉందనేది తెలియాల్సి ఉంది.

# కలెక్షన్లలో దూసుకెళుతున్న పెద్ది

**రూ.332.1 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు**

**బలగం టీవీ, హైదరాబాద్**




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కిన భారీ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకుపోతోంది. విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణను అందుకుంటున్న ఈ చిత్రం వసూళ్ల పరంగా కూడా సత్తా చాటుతోంది. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా కేవలం ఆరు రోజుల్లోనే రూ.332.1 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి సంచలనం సృష్టించింది. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించిన చిత్రబృందం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. ప్రస్తుతం ఈ పోస్టర్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో క్రీడలు, భావోద్వేగాలు, కుటుంబ బంధాలు, పోరాట స్ఫూర్తి వంటి అంశాలను దర్శకుడు బుచ్చిబాబు సాన ఆకట్టుకునే విధంగా చూపించారు. ముఖ్యంగా రామ్ చరణ్ నటనకు ప్రేక్షకులు, అభిమానుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. హీరోయిన్‌గా జాన్వీ కపూర్ నటించగా, జగపతిబాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ, రవికిషన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ అందించిన పాటలు, నేపథ్య సంగీతం కూడా సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. సినీ వర్గాల సమాచారం ప్రకారం 'పెద్ది' చిత్రానికి ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.218.50 కోట్ల థియేట్రికల్ బిజినెస్ జరిగినట్లు తెలుస్తోంది. ఈ సినిమా పూర్తిస్థాయి విజయాన్ని నమోదు చేయాలంటే దాదాపు రూ.220 కోట్ల షేర్ వసూలు చేయాల్సి ఉంటుంది. అంటే గ్రాస్ పరంగా రూ.440 కోట్ల మార్క్‌ను అందుకోవాల్సి ఉంటుంది. ఇప్పటివరకు రూ.332 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించిన నేపథ్యంలో బ్రేక్ ఈవెన్ చేరుకోవడానికి మరో రూ.108 కోట్ల గ్రాస్ అవసరమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో 'పెద్ది' ఇప్పటికే బ్రేక్ ఈవెన్ సాధించినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.



# తండ్రికి తగ్గ తనయుడిగా బాలకృష్ణ

**బాలకృష్ణ జన్మదినోత్సవం**

**అభినందనలు తెలిపిన ప్రముఖులు**

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో నటసింహం నందమూరి బాలకృష్ణ నటప్రస్థానం ఒక అద్భుతం. ఆయన జన్మదినం సందర్భంగా చిత్ర ప్రముఖులు అభినందనలు తెలిపారు. ఐదు దశాబ్దాలకు పైగా సాగుతున్న బాలయ్య కెరీర్‌లో ఎన్నెన్నో అపూర్వ విజయాలు, మరెవరికీ సాధ్యంకాని రికార్డులు. వసూళ్ల పరంగానే కాదు, థియేటర్లలో అత్యధిక రోజులు ప్రదర్శించబడిన సినిమా కూడా బాలయ్య పేరుతోనే ఉంది. బాలకృష్ణ పని అయిపోయింది అని విమర్శకులు భావించిన ప్రతిసారీ మాస్ కంబ్యాక్ ఇవ్వడమే కాదు బాక్స్ ఆఫీస్ వద్ద సరికొత్త రికార్డులతో విమర్శకుల నోళ్లు మూయించాడు. మహానటుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు ఐదవ కుమారుడిగా 1960 జూన్ 10న బాలకృష్ణ జన్మించారు. తండ్రి నేర్పిన అపారమైన వృత్తి నిబద్ధత, క్రమశిక్షణ, తల్లి బసవరామతారకం అందించిన ప్రేమానురాగాలు బాలయ్యను ఒక విలక్షణమైన వ్యక్తిగా తీర్చిదిద్దాయి. ఓవైపు బడిలో పాఠాలు చదువుకుంటూనే 1974లో ఎన్టీఆర్ నటించిన తాతమ్మకల సినిమా ద్వారా వెండితెరకు పరిచయం అయ్యాడు బాలయ్య. అన్నదమ్ముల అనుబంధం, వేములవాడ భీమకవి, దానవీరశూరకర్ణ, శ్రీమద్విరాటపర్వము, శ్రీతిరుపతి వేంకటేశ్వర కళ్యాణం, రౌడీరాముడు-కొంటె కృష్ణుడు, అనురాగదేవత, సింహం నవ్వింది, శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర' వంటి చిత్రాలలో తండ్రి ఎన్టీఆర్ తో కలిసి నటించి మెప్పించాడు బాలయ్య. 1984లో సాహసమే జీవితం సినిమాతో సోలో హీరోగా మారారు. కానీ ఆ సినిమా ఆశించినంతగా ఆడలేదు. తొలిమూడు సినిమాలు ఫ్లాప్ అవడంతో బాలయ్యపై విమర్శలు వచ్చాయి. కానీ నాలుగవ సినిమాగ వచ్చిన మంగమ్మగారి మనవడు'తో బాలయ్య తన పవర్ ఏంటో చూపించాడు. ఆ సినిమా ఏకంగా 565 రోజులు ఆడి రికార్డులు క్రియేట్ చేసింది.

# ఒలింపిక్స్‌లో కోహ్లీని ఆడించాలి..

**టీమిండియా మాజీ క్రికెటర్ శ్రీశాంత్**

**బలగం టీవీ, హైదరాబాద్**

లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ 2028లో విరాట్ కోహ్లీని ఆడించాలని టీమిండియా మాజీ క్రికెటర్ శ్రీశాంత్ సూచించాడు. విరాట్ కోహ్లీ క్లాస్ బ్యాటింగ్‌కు టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ విధ్వంసం తోడైతే టీమిండియాకు తిరుగుండదని శ్రీశాంత్ అభిప్రాయపడ్డాడు.128 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఒలింపిక్స్‌లోకి క్రికెట్ రీఎంట్రీ ఇస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒలింపిక్ స్వర్ణమే లక్ష్యంగా టీమిండియా సిద్ధమవుతోంది. విశ్వక్రీడల్లో బరిలోకి దిగే భారత క్రికెట్ టీమ్ కూర్పుపై చర్చ మొదలైంది.తాజాగా ఓ యూట్యూబ్ ఛానెల్‌తో మాట్లాడిన శ్రీశాంత్.. ఒలింపిక్స్ ఆడేలా విరాట్ కోహ్లీని ఒప్పించాలని సెలెక్టర్లకు సూచించాడు. 'మనం ఒలింపిక్ స్వర్ణం గురించి మాట్లాడుకుంటున్నాం. అలాంటి మెగా టోర్నీలో విరాట్ కోహ్లీ తప్పకుండా ఆడాలని నేను అభ్యర్థిస్తున్నాను. అతని అపార అనుభవం, యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ లాంటి కుర్రాడి దూకుడు కలిస్తే ఆ జట్టు అద్భుతంగా ఉంటుంది. సీనియర్, జూనియర్ ఆటగాళ్ల కలయికతో జట్టును బలోపేతం చేయవచ్చు.విరాట్ కోహ్లీకి టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించినా.. ఒలింపిక్స్ ఆడేలా అతన్ని సెలెక్టర్లు ఒప్పించాలి. విరాట్ కోహ్లీ ఫిట్‌నెస్‌ను పరిగణనలోకి తీసుకోవాలి. ఇది వివాదాస్పదం కావొచ్చు.. కానీ దయచేసి విరాట్‌ను ఒలింపిక్స్ జట్టులోకి తీసుకోండి అని సెలక్టర్లను కోరుతున్నాను'అని శ్రీశాంత్ చెప్పుకొచ్చాడు.ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2024 విజయానంతరం అంతర్జాతీయ టీ20లకు విరాట్ కోహ్లీ వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. ఐపీఎల్ 2026 సీజన్‌లో అద్వితీయమైన బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చిన వైభవ్ సూర్యవంశీ.. అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసేందుకు సిద్ధమయ్యాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో 776 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచి ఆరెంజ్ క్యాప్ అందుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో కూడా వైభవ్ సత్తా చాటితే ఒలింపిక్స్ జట్టులో ఉంటాడు. 1900 సంవత్సరం తర్వాత మళ్లీ ఇప్పుడే ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను భాగం చేశారు. లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో పురుషుల, మహిళల విభాగాల్లో ఆరు జట్ల చొప్పున టీ20 ఫార్మాట్‌లో మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. క్రికెట్‌తో పాటు బేస్‌బాల్/సాఫ్ట్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, లాక్రోస్, స్క్వాష్‌లను కూడా చేర్చారు.

# ప్రకృతి ప్రేమికుడు భారతీరాజా

● పల్లె అందాలకు చిత్రాల్లో పెద్దపీట

**బలగం టీవీ, హైదరాబాద్**



ప్రకృతిని ప్రేమించడం.. అనుభవించడం.. ఆస్వాదించడం..ఆనందించడం అందరికీ తెలుసు. కాని ఈప్రకృతి రమణీయకతను సెల్యూలాయిడ్‌పై చూపి ప్రేక్షకులను రంజిపం చేయడం కొందరికే తెలుసు. అందులో ముందుంటారు దర్శకలు భారతీరాజా. ఆయన తీసిన చిత్రలే అందుకు నిదర్శనం. భారతీయ సినీ ప్రపంచంలో గ్రామీణ జీవితానికి కొత్త భాషను నేర్పిన దర్శకుడు ఆయన పల్లె అందం, అక్కడి మనుషుల స్వచ్ఛమైన ప్రేమ, వారి అనుబంధాలు – ఆనందాలు, బాధలు – భావోద్వేగాలను ఎంతో సహజంగా వెండితెరపై ఆవిష్కరించడంలో ఆయన తరవాతే ఎవరైనా. ఆయన తెరకెక్కించిన ప్రతి సినిమా మట్టివాసనతో నిండిన ఓ జీవనరాగంలా అనిపిస్తుంది. ప్రేమను కవిత్వంగా, బంధాలను హృద్యంగా, ప్రకృతిని పాత్రగా మలిచిన ఆయన చిత్రాలు ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేశాయి. భావోద్వేగాలకు దృశ్యరూపమిచ్చిన ఓ గొప్ప కథకుడుగా ఆయన చిత్రసీమలో నిలిచి పోయారు. భారతీరాజా భౌతికంగా దూరమయినా, ఆయన తీసిన మణిపూసల్లాంటి చిత్రాలు నిరంతరం మన మనసులను తడుతూనే ఉంటాయి. కన్నడ దర్శకుడు పుట్టణ్ణ కనగల్, పి.పుల్లయ్య వంటి దిగ్గజాల వద్ద సహాయ దర్శకుడిగా పనిచేసి సినిమాలో మెళకువలు నేర్చుకున్నారు. అలా ఆయన పరిశ్రమలోకి అడుగుపెట్టారు.భారతీరాజా తన సినిమాల్లో ఎక్కువగా పల్లెటూరి కథలనే చూపించేవారు. మట్టివాసనను వెండితెర పైకి తెచ్చిన దర్శకుడిగా ఆయనకు పేరుంది. హీరోయిన్లను మేకప్ లేకుండా స్వచ్ఛంగా చూపించేవారు. దీని వెనుక కారణాన్ని ఆయన ఓ సందర్భంలో తనదైన చతురతను జోడించి చెప్పారు. 'ప్రకృతికాంత' అందానికి ముగ్ధుడినయ్యా. అందుకే కెమెరా పట్టుకుని ఆ అందాన్ని వెతుక్కుంటా అంటూ పల్లెలపై తన ప్రేమను వ్యక్తపర్చారు. 1977లో వచ్చిన '16 వయతినిలే' (తెలుగులో 'పదహారేళ్ల వయసు' పేరుతో రీమేక్ అయ్యింది) సినిమాతో భారతీరాజా దర్శకుడిగా పరిచయమయ్యారు. అప్పటివరకు కేవలం స్టూడియో సెట్టింగులకే పరిమితమైన తమిళ సినిమాను నిజమైన పల్లెటూరి లొకేషన్లలోకి తీసుకెళ్లి సరికొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టారు. ఎలాంటి మేకప్ లేకుండా హీరోలను చూపించడం, ఎలాంటి అదనపు సొగసుల జోలికి వెళ్లకుండా సహజంగా ఉన్న అమ్మాయిలను హీరోయిన్లుగా పరిచయం చేయడంతో అప్పటి సినీ సంప్రదాయాలను తిరగరాశారు. కేవలం గ్రామీణ చిత్రాలకే పరిమితం కాకుండా, 'సిగప్పు రోజాక్కల్' (తెలుగులో ఎర్ర గులాబీలు) వంటి సైకో థ్రిల్లర్ చిత్రాలతో తన బహుముఖ ప్రజ్ఞను చాటుకున్నారు. తెలుగులో ఆయన దర్శకత్వం వహించిన 'సీతాకోకచిలుక' (1981) చిత్రం అప్పట్లో పెను సంచలనం సృష్టించింది. కుల వివక్షకు వ్యతిరేకంగా ఆయన తీసిన 'వేదం పుదిదు' సినిమా సమాజంలో పెద్ద చర్చకు దారితీసింది. రాధిక, రాధ, రేవతి, కార్తీక్, విజయశాంతి వంటి ఎందరో నటీనటులను ఆయనే వెండితెరకు పరిచయం చేశారు. భారతీరాజా ప్రతిభకు ఎన్నో అవార్డులు దాసోహమన్నాయి. ఆయన తన కెరీర్‌లో దాదాపు 40 చిత్రాలకు దర్శకత్వం వహించి, 'ఇయక్కునార్ ఇమయం (దర్శక శిఖరం)' అనే బిరుదును పొందారు. జాతీయ అవార్డులు: వివిధ విభాగాల్లో మొత్తంగా 6 జాతీయ చలనచిత్ర అవార్డులను అందుకున్నారు. ఇందులో తెలుగు చిత్రం 'సీతాకోకచిలుక'కు ఉత్తమ ప్రాంతీయ చిత్ర అవార్డు కూడా ఉంది. సినీ రంగానికి ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ 2004లో భారత ప్రభుత్వం 'పద్మశ్రీ' పురస్కారంతో గౌరవించింది. వీటితో పాటు 4 ఫిలింఫేర్ అవార్డులు, 6 తమిళనాడు రాష్ట్ర అవార్డులు, నంది అవార్డులను ఆయన సొంతం చేసుకున్నారు. ఆయన కేవలం దర్శకత్వానికే పరిమితం కాకుండా నటుడిగానూ అలరించారు. 'ఆయుధ ఎళుతు', 'పాండియనాడు', 'తిరుచిత్రంబలమ్' (తిరు), గతేడాది వచ్చిన విజయ్ సేతుపతి 'మహారాజా' చిత్రాల్లో కీలక పాత్రలు పోషించి మెప్పించారు. మోహన్‌లాల్ 'తుడరుమ్'లో చివరిసారి తెరపై కనిపించారు. అలాగే ఆయన నటించిన 'పులవర్' చిత్రం ఇంకా విడుదల కావాల్సిఉంది. భారతీరాజా తర్వాతితరం చిత్రనిర్మాతల కు శిక్షణ ఇవ్వడానికి 'భారతీరాజా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సినిమా'ని స్థాపించారు.










# ఆల్ఫా టీజర్ విడుదల

**భారీ యాక్షన్ సీన్లతో కొత్తగా ఆలియా భట్**

**బలగం టీవీ, హైదరాబాద్**

యశ్‌రాజ్ ఫిలిమ్స్ స్పై యూనివర్స్ నుంచి వస్తున్న 7వ సినిమా 'ఆల్ఫా' టీజర్ బుధవారం విడుదలైంది. శివ్ రావల్ దర్శకత్వంలో భారీ యాక్షన్ చిత్రంగా వస్తున్న ఈ సినిమాలో అలియా భట్ మునుపెన్నడూ చూడని సరికొత్త లుక్‌లో కనిపించింది. ఈ టీజర్‌లో అలియా భట్ ఒక ట్రైన్డ్ కిల్లర్‌గా శత్రువులపై విరుచుకుపడుతూ కనిపించగా, బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ఆమెకు తండ్రిగా ఒక ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాలో అలియా భట్ కేవలం ఒక సాధారణ అమ్మాయిలా కాకుండా, చిన్నప్పటి నుంచే పోరాటాల మధ్య పెరిగిన ఒక ప్రమాదకరమైన హంతకురాలిగా కనిపించబోతుంది. భారీ యాక్షన్ సీన్లు, గన్‌ఫైట్లు,క్లైమాక్స్ టింగ్‌లతో ఆమె అదరగొట్టింది. ఈ టీజర్ సినిమాలోని యాక్షన్‌ను చూపించడమే కాకుండా, అలియా భట్, బాబీ డియోల్ పాత్రల మధ్య ఉండే బలమైన బంధాన్ని కూడా చూపిస్తోంది.

మరోవైపు ఈ సినిమాలో మరో హీరోయిన్ శర్వరి కూడా నటిస్తోంది. రాబోయే రోజుల్లో ఆమె పాత్రకు సంబంధించిన వివరాలను చిత్ర బృందం ప్రకటించనుంది. బాలీవుడ్‌లో ఇద్దరు హీరోయిన్లు ముఖ్య పాత్రల్లో నటిస్తున్న అరుదైన భారీ యాక్షన్ సినిమా ఇది. యాక్షన్, సెంటిమెంట్, సస్పెన్స్, కామెడీ కలబోతగా వస్తున్న ఈ సినిమాలో అనిల్ కపూర్ కూడా ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు.




ఈ మోస్ట్ అవేటెడ్ స్పై థ్రిల్లర్ మూవీ 2026, జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# ఆఫ్ఘనిస్తాన్‌తో వన్డే సిరీస్‌కు కోహ్లీ దూరం




**బలగం టీవీ, హైదరాబాద్**

ఇండియా క్రికెట్ ఫ్యాన్స్‌కు ఒకేసారి గుడ్ న్యూస్, బ్యాడ్ న్యూస్ వచ్చాయి. ఆఫ్ఘనిస్తాన్‌తో జరగబోయే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు టీమిండియా సీనియర్ ప్లేయర్స్ రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా జట్టులోకి తిరిగి రానున్నారు. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నిర్వహించిన ఫిట్‌నెస్ అసెస్‌మెంట్‌లో వీరిద్దరూ సక్సెస్‌ఫుల్‌గా పాస్ అయినట్లు ఏఎన్ఐ వర్గాలు తెలిపాయి. ఐపీఎల్

## రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా జట్టులోకి....

2026 సీజన్ లో ముంబై ఇండియన్స్ తరఫున ఆడుతున్నప్పుడు రోహిత్ హ్యామ్‌స్ట్రింగ్ గాయంతో, హార్దిక్ బ్యాక్ స్పాజమ్స్ సమస్యతో ఇబ్బంది పడ్డారు. ఇప్పుడు ఫిట్‌నెస్ క్లియరెన్స్ రావడంతో త్వరలోనే వీరు నేషనల్ స్క్వాడ్‌తో కలవనున్నారు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ హ్యామ్‌స్ట్రింగ్ ఇంజూరీ కారణంగా ఈ వన్డే సిరీస్ నుంచి కంప్లీట్‌గా రూల్ అవుట్ అయ్యాడు. ఐపీఎల్ 2026 ఫైనల్ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టైటిల్ డిఫెండ్ చేసుకున్న టైంలో కోహ్లీకి ఈ గాయమైంది. కోహ్లీ రికవరీ టైమ్‌లైన్‌పై చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ అప్‌డేట్ ఇచ్చాడు. గాయం జరిగి ఇంకా వారం కూడా కాలేదని, ఫిజియోలు పరిశీలిస్తున్నారని చెప్పాడు. ఇంగ్లాండ్ వన్డే సిరీస్ నాటికి కోహ్లీ ఫిట్ అయ్యే ఛాన్స్ ఉన్నప్పటికీ, అది కచ్చితమైన సమాధానం కాదని అగార్కర్ స్పష్టం చేశాడు. కోహ్లీ ప్లేస్‌లో యంగ్ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ను వన్డే స్క్వాడ్‌లోకి తీసుకున్నారు. ఇండియా, ఆఫ్ఘనిస్తాన్ మధ్య జూన్ 13 నుంచి వన్డే సిరీస్ స్టార్ట్ కానుంది. మొదటి వన్డే జూన్ 13న ధర్మశాలలో జరుగుతుంది. రెండో వన్డే జూన్ 17న లక్నోలో, చివరి వన్డే మ్యాచ్ జూన్ 20న చెన్నైలో నిర్వహించనున్నారు. శుభ్‌మన్ గిల్ ఈ సిరీస్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తుండగా, శ్రేయాస్ అయ్యర్ వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు చూసుకోనున్నాడు. కేఎల్ రాహుల్, ఇషాన్ కిషన్ వికెట్ కీపర్లుగా ఉన్నారు. నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, ప్రిన్స్ యాదవ్, గుర్నూర్ బ్రార్, హర్ష్ దూబే ఈ వన్డే స్క్వాడ్‌లో చోటు దక్కించుకున్నారు.

# కమీషన్ దొబ్బుతూనే విమర్శలా?

**సునీల్ గవాస్కర్ ఆగ్రహం**

**బలగం టీవీ, హైదరాబాద్**



ఐపీఎల్ టోర్నీపై విమర్శలు గుప్పిస్తున్న విదేశీ మాజీ క్రికెటర్లు, క్రికెట్ బోర్డులపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీసీఐ నుంచి 10 శాతం కమీషన్ దొబ్బుతూనే టోర్నీపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కేవలం తమ ప్రయోజనాల కోసం భారత క్రికెట్‌ను తక్కువ చేసి మాట్లాడటం సరికాదని ఆయన హితవు పలికారు. ఐపీఎల్ 2026 సీజన్‌లో పూర్తి స్థాయిలో ఆడిన ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్.. న్యూజిలాండ్‌తో తొలి టెస్ట్‌కు దూరంగా ఉన్నాడు. అంతర్జాతీయ టెస్ట్ క్రికెట్ కంటే ఐపీఎల్ వంటి లీగ్‌లకు ప్రాధాన్యత ఇస్తున్నారంటూ పలువురు మాజీ క్రికెటర్లు ఆర్చర్‌పై విమర్శలు గుప్పించారు. ఐపీఎల్ టోర్నీని తప్పుబట్టారు.ఫ్రాంచైజీ లీగ్స్‌తో అంతర్జాతీయ క్రికెట్‌కు ముప్పు పొంచి ఉందని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ అన్నాడు. 'టీ20 లీగ్‌లు ఆటగాళ్లకు మంచివే. కానీ అంతర్జాతీయ టెస్టు క్రికెట్ కంటే వీటికే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం భవిష్యత్తులో పెద్ద సమస్యగా మారుతుంది'అని పేర్కొన్నాడు. న్యూజిలాండ్ మాజీ ప్లేయర్ సైమన్ డౌల్ సైతం ఆర్చర్ తీరును తప్పుబట్టాడు. డబ్బుల కోసం దేశం తరఫున జరిగే మ్యాచ్‌కు అందుబాటులో లేకపోవడం సరికాదని విమర్శించాడు. గతంలో ట్రెంట్ బౌల్ట్ వంటి ఆటగాళ్లు ఐపీఎల్ సమయాల్లోనూ టెస్ట్‌ల కోసం సిద్ధమయ్యేవారని గుర్తు చేశాడు. ఈ మాజీ ఆటగాళ్ల విమర్శలను సునీల్ గవాస్కర్ ఖండించారు. ఐపీఎల్, భారత క్రికెట్‌ను విమర్శించడం కొందరు విదేశీ ఆటగాళ్లకు అలవాటుగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. ఐపీఎల్‌లో ఆడే విదేశీ ఆటగాళ్లకు ఇచ్చే వేతనంలో 10 శాతం వాటాను బీసీసీఐ నేరుగా ఆయా దేశాల క్రికెట్ బోర్డులకు చెల్లిస్తోందని ఆయన గుర్తు చేశారు.ఇంగ్లండ్, ఆస్ట్రేలియా లీగ్‌లు ఇలాంటి పద్ధతిని పాటించడం లేదని ఆయన ఎత్తిచూపారు. మిలియన్ల పౌండ్లను బీసీసీఐ నుంచి పొందుతున్న బోర్డులే..ఇప్పుడు ఐపీఎల్‌ను తక్కువ చేసి మాట్లాడటం వారి ద్వంద ప్రమాణాలకు నిదర్శనమని గవాస్కర్ మండిపడ్డారు. 'భారత క్రికెట్, ఇక్కడి అభిమానుల సొమ్ముతో విదేశీ బోర్డులు తమ ఖజానాను నింపుకుంటున్నాయి. ఆ విషయాన్ని మరిచిపోయి ఐపీఎల్‌ను ద్వేషించడం విడ్డూరంగా ఉంది. భారత క్రికెట్‌ను ఎంతగా తక్కువ చేసి చూపే ప్రయత్నం చేసినా..ప్రపంచ క్రికెట్‌లో టీమిండియా ఆధిపత్యం కొనసాగుతూనే ఉంటుంది. ఇప్పటికైనా విమర్శకులు వాస్తవాలను గుర్తించాలి.'అని గవాస్కర్ చురకలంటించారు.